విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శనివారం 05 ఏప్రిల్ 2025 8 పేజీలు

అక్రమ మద్యం ధ్వంసం

పర్యవేక్షించిన ఎస్పీ ఆర్. గంగాధర్ రావు

విశాలాంధ్ర-బ్యూరో మచిలీపట్నం : జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు కలిసి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 2013 ఏప్రిల్ నెల నుండి 2025 ఫిబ్రవరి నెల వరకు సీజ్ చేసిన వేలకొలది అక్రమ మద్యం బాటిల్స్‌ను, నాటు సారాను ధ్వంసం చేశారు. సుమారు 814 కేసులలో ఉన్న 15,280 మద్యం బాటిల్స్‌ను 65 కేసులలో ఉన్న 684.83 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. మద్యం బాటిల్స్ విలువ సుమారు 28,97,000 రూపాయల విలువ ఉంటుందని తెలిపారు. జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం నిర్మూలనకు ఇంకా సమర్థవంతమైన ఎన్ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం రవాణా, విక్రమాలకు పాల్పడితే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌డిపిఎల్ బందరు డివిజన్‌లో 3 కేసుల్లో 13 బాటిల్స్, గుడివాడ 1కేసులో 2 బాటిల్స్, గన్నవరం 3 కేసుల్లో 185 బాటిల్స్ మొత్తం మూడు డివిజన్లలో 7 కేసుల్లో 200 బాటిల్స్ ఉన్నట్లు తెలిపారు. బందరులో నాటుసారా 14 కేసుల్లో 161.58 లీటర్లు, పెడన 26 కేసుల్లో 216.5 లీటర్లు, గూడూరు 3 కేసుల్లో 84.25 లీటర్లు, కృత్తివెన్ను 22 కేసుల్లో 222.5 లీటర్లు నాటుసారా పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు పోలీసు అధికారులు ముమ్మరంగా దాడులు, తనిఖీలు నిర్వహించి పెద్దఎత్తున అక్రమ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసికొని వాటిని శుక్రవారం ధ్వంసం చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లలో నమోదయిన 823 కేసుల్లో ఇతర రాష్ట్రాల కు చెందిన మద్యం మరియు డ్యూటీ పైడ్ లిక్కర్ విఔట్ హీల్స్) వివిధ బ్రాండ్లకు చెందిన 20,921 మద్యం బాటిల్స్ ధ్వంసం చేయడం జరిగిందని వాటి విలువ సుమారు 28,97,000 రూపాయలు ఉంటుందన్నారు. జిల్లాలో నాటుసారా మరియు అక్రమ మద్యం నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారు 65 కేసుల్లో 684.83 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి ధ్వంసం చేసినట్లు తెలిపారు. జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. అక్రమ మద్యం రవాణా, విక్రయాలు, నాటుసారా తయారీకి సంబందించిన సమాచారం తెలిస్తే

మిగతా 4 లో ...

మహిళా ఉద్యమ కెరటం గుజ్జుల సరళదేవి

నివాళులర్పించిన మహిళ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మహిళా ఉద్యమ నేత గుజ్జుల సరళదేవి ఘన నివాళులర్పించిన మహిళా నేతలు. మహిళా సమాఖ్య నగర కమిటీ ఆధ్వర్యంలో దాసరి భవన్ వద్ద గుజ్జుల సరళా దేవి 27వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ గుజ్జుల సరళాదేవి విద్యార్థి దశ నుండే వామపక్ష భావాలతో ఉద్యమ బాటపట్టారని, కల్లు మానండోయ్ బాబు, కళ్ళు తెరవండోయ్ బాబు, వళ్ళు గుల్లగునోయ్ బాబు, కల్లు వల్ల శాంతి లేదంటూ బాబు ఈ పాటతో ఊరూరా తిరిగి మహిళలను చైతన్య పరిచే వారిని గుర్తు చేశారు. 1936 గుంటూరు జిల్లా గురజాలలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మందపాటి నాగిరెడ్డి అన్న మందపాటి పేరిరెడ్డి లక్ష్మీదేవి దంపతులకు సరళ దేవి జన్మించారని చెప్పారు. బాల్యం నుండే, పువ్వు పుట్టగానే పరిమళించినట్టుగా కమ్యూనిస్టు ఉద్యమ త్యాగాల స్ఫూర్తితో సాంఘిక దురాచారాలకు, మద్యపానానికి

మిగతా 2 లో ...

4వ రోజుకు ఐరన్ కార్మికుల సమ్మె

- మద్దతు తెలిపిన సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఐరన్ షాపుల్లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు పనిభద్రత కల్పించి కూలీ రేట్ల పెంపుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. కూలీ రేట్ల పెంపుదల కోసం ఐరన్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో సమ్మెకు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మద్దతు తెలియజేశారు. కోట ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఐరన్ షాపుల్లో పనిచేస్తూ ఎండనక వాననక నిత్యం శ్రమ చేస్తున్న ముఠా కార్మికుల అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసినప్పటికీ నూతన అగ్రిమెంటు చేయటంలో యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని అన్నారు. నూతన అగ్రిమెంట్ చేయటానికి యాజమాన్యం సహకరించాలని, లేని పక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. దేశంలో పెరిగిపోయిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా కూలీ రేట్ల పెంపుదల చేయాలని ఆ వైపుగా యాజమాన్యం సహకరించి కార్మికులకు నూతన కూలీ రేట్లను పెంపుదల చేసి అమలు చేయాలని ఆయన యజమాన్యాన్ని కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు నూతల పాటి చిన్న, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఐరన్ ముఠా మేస్త్రిలు పప్పుల రోసిరెడ్డి, కొంగలి కోటయ్య, బిచ్చాల కొండ, ఉప్పలపాటి శ్రీను, సత్యం, ఖాజావలి, శ్రీహరి, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

బీసీ గురుకులం పీఈటీ సుజాత పై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థులపై దురుసూ ప్రవర్తననూ ఖండిస్తున్నాం...
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : విద్యార్థులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న తొండూరు బీసీ గురుకులం పిఈటి సుజాత ని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ సాయికుమార్ ప్రభుత్వ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దాసరి భవన్ నందు పాత్రికేయులు సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ తొండూరులోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో పీటిగా పనిచేస్తున్న సుజాత విద్యార్థినీయులపై అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, వాళ్ళ తల్లిదండ్రులను కూడా అసభ్య పదజాలంతో దూషిస్తూ.. కూటికి దిక్కు లేక వచ్చారు కదా మీకెందుకు చదువులు ఏదైనా పని చేసుకూ చావండి అంటూ.. మరి ముఖ్యంగా మీ తల్లిదండ్రులు సాకలేక ఇక్కడ వదిలేశారు. మీరు తినడానికి తప్ప దేనికి పనికిరారు. అంటూ వెళ్లి బాత్రూములు కడిగే పని ఉంటే చేసుకోండి, కూలి పనులకు వెళ్ళండి

మిగతా 2 లో ...

వక్ఫ్ బిల్లు ఆమోదంపై ముస్లింల నిరసన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశంలో ముస్లీం మైనార్టీలను అణగతొక్కేందుకు కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిందని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఫ్సర్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ పంజాసెంటర్‌లో ముస్లీంలు నిరసనలు తెలిపారు. నమాజ్ (ప్రార్ధన) అనంతరం పంజా సెంటర్ కు చేరుకున్న ముస్లీంలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లకార్డులను ప్రదర్శించి మోడీ, చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినా దాలు చేశారు. ఈ సందర్భంగా అప్సర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని పౌర సమాజానికి సమాన హక్కులు కల్పించిందన్నారు. దేశవ్యాప్తంగా ముస్లీం మైనార్టీల ఆస్తులకు రక్షణగా ఉన్న భూములు ఆస్తులన్నింటినీ గుర్తించి ప్రత్యేక వక్ఫ్ చట్టాన్ని

మిగతా 2 లో ...

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ వలి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు, ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియం నుంచి హిమనీ సెంటర్ గాంధీ బొమ్మ వరకు భారీ నిరసన ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అన్యాయంగా వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని

మిగతా 4 లో ...

(మొదటి పేజీ తరువాయి)

వక్ఫ్ బిల్లు ఆమోదంపై ముస్లింల నిరసన

రాజ్యాంగం అమలు చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కేందుకు అనేక రకాల చట్టాలను అమల్లోకి తెచ్చి ప్రజాస్వామ్యాన్ని, స్వతంత్రతను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు ఆస్తులను కట్టబెట్టమే కేంద్రం లక్ష్యంగా చర్యలు చేపట్టిందన్నారు. బీహార్‌లో ఉన్నట్టువంటి నితీష్ కుమార్, ఏపీలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం బిల్లుకు మద్దతుగా ఓటు వేశారని, ఆ ఫలితం అనుభవిస్తారన్నారు. ముస్లిం సమాజం ఎప్పటికి క్షమించదన్నారు. చంద్రబాబు వెనుపోటు దారుడిగా మారారు. ముస్లింలకు వెన్నుపోటు పొడిచారన్నారు. వక్ఫ్ బిల్లు ఆమోదం పొందడానికి ప్రధాన కారకుడు చంద్రబాబే అన్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖలో అన్యామతస్తులకు అవకాశం ఇస్తారా అని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న షాపుల్లో అన్యామతస్తులకు వ్యాపారం కూడా చేయనివ్వరని, అలాంటి వక్ఫ్ బోర్డ్‌లో అన్యామతస్తులకు ఏలా అవకాశం కల్పిస్తారా అని ప్రశ్నించారు. రంజాన్ మాసంలో ప్రభుత్వం చేపట్టిన ఇఫ్తార్ కార్యక్రమంలో చంద్రబాబు ముస్లింలకు అండగా ఉంటామని చెప్పారు. ముస్లిం ప్రజలను నమ్మించి మోసం చేసి వక్ఫ్ బిల్లుకు ఓటు వేశారన్నారు. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని ముస్లిం నాయకులు రాజీనామాలు చేసి బయటకు వస్తున్నారని, టీడీపీలోని నాయకులు, ఎమ్మెల్యే, మంత్రులు కూడా రాజీనామా చేసి పార్టీని విడలన్నారు. యంసీపీఐ(యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం ఓట్లతో గెలిచి అధికారం ఎక్కిన తరవాత వక్ఫ్ ఆస్తులను అత్తసొమ్ము అల్లుడు దానంలాగా ఢిల్లీలో తాకట్టు పెట్టారన్నారు. ముస్లిం ద్రోహి చంద్రబాబు అన్నారు. వైసీపీ నాయకులు ఆసీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి చంద్రబాబు నిజస్వరూపం బయటపడిందన్నారు. ముస్లింలు ఓటు వేసిన పాపానికి రాష్ట్ర ముస్లిం ప్రజలకు రంజాన్ తోఫా ఇచ్చారన్నారు. చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిగిలిపోతారన్నారు. ముస్లిం సమాజం ఎప్పటికి క్షమించరన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం కార్పొరేటర్ బొయి సత్తిబాబు, మైనార్టీ నాయకులు సలీం, ఫరూక్, సమద్, సల్మాన్, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులం పీఈటీ సుజాత పై చర్యలు తీసుకోవాలి

అంటూ దూర్భాషలాడటం. నోటికి ఎంత మాట వస్తే అంత మాట మాట్లాడుతూ విద్యార్థులను కించపరిచే విధంగా ప్రవర్తిస్తున్నారని, ఆమె ప్రవర్తనన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పిల్లల ఆత్మ అభిమానం దెబ్బ తినే విధంగా ప్రవర్తిస్తుంది, అదేవిధంగా బిసి సంక్షేమ శాఖ మంత్రిని కూడా లెక్కచేయకుండా పిల్లల వద్ద అవహేళనగా మాట్లాడుతూ విద్యార్థులను కులం పేరుతో, ప్రాంతాల పేరుతో దూషించడమే కాక వారిని అనేక చిత్రవదలకు గురి చేస్తున్నారని, విద్యార్థి నీ యొక్క తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులకు మరియు గ్రీవెన్స్ లో కంప్లైంట్ చేయడం జరిగిందన్నారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి సేకరించిన సమాచారాన్ని మహాత్మ గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల రాష్ట్ర కార్యాలయం కు పంపించారు. కానీ ఇప్పటివరకు రాష్ట్ర కార్యాలయం నుంచి ఎటువంటి సమాచారం అందించకుండా నిర్లక్ష్యంగా, విద్యార్థులు కంప్లైంట్ చేశారని సుజాత పైన ఎంక్వైరీ కమిటీ వేశారని, ఆవిడ మళ్లీ ఒక రోజు రాత్రి 12:30 గంటల సమయంలో పిల్లల్ని ఇబ్బంది పెట్టడం జరిగింది. కావున ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పిఈటి సుజాతను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తరపున అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్‌రాష్ట్ర సమితి, విద్యార్థినీయుల తల్లి దండ్రులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీయుల తల్లిదండ్రులు ఈశ్వరయ్య, మునిరెడ్డి, సుధాకర్, విజయ్, సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ కెరటం గుజ్జుల సరళదేవి

వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసే దిశగా అడుగులు వేశారని కొనియాడారు. ఈ క్రమంలో కల్లు వ్యతిరేక ఉద్యమం నడిపిన కమ్యూనిస్టు అగ్రనాయకుల్లో ఒకరైన గుజ్జుల ఎలమందరెడ్డితో వివాహం జరిగిందన్నారు. అనంతరం స్త్రీ, పురుష వేతన సంఘంలో నిరక్షరాస్యత, నిర్మూలన సంఘంలో ఆమె పనిచేస్తూ, వయోజన మహిళల కోసం కేవలం మూడు సంవత్సరాల్లో సుమారు 300 స్కూల్ నిర్వహించారని తెలిపారు. అంతేకాకుండా మద్యపాన నిషేధం, వరకట్న నిషేధం, దురాచారాలపై ఆమె పాటలు రాసి పాడేవారని, ఆమె నాయకత్వంలో కార్యకర్తలు ఊరూరా తిరుగుతూ కళా ప్రదర్శన ఇచ్చేవారని, స్త్రీ హస్తిహక్కు, వివాహ రక్షణ హక్కు, వారసత్వ దత్తత స్వీకరణ హక్కు, మనోవర్తి హక్కుల సాధనకై ఉద్యమించారు. 33% రిజర్వేషన్ కోసం హైదరాబాదులో ఆమె నాయకత్వంలో జరిపిన ప్రదర్శనలు ప్రముఖమైనవన్నారు. పార్టీ ఉద్యమాల్లో భర్తతో ప్రముఖ పాత్ర పోషిస్తూ.. 1970లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి, నిర్మాణాన్ని పటిష్ట పరచడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారన్నారు. 1994లో కురుక్షేత్రంలో జరిగిన 14వ జాతీయ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. ఉద్యమమే ఊపిరిగా జీవిస్తూ.. 1998 ఏప్రిల్ 4న అకాల మృతి, మహిళా ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఆమె పేరు మీద సింగ్ నగర్ లో కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు తమ్మిన దుర్గ, నిలాపు భాగ్యలక్ష్మి, ఎస్ కె నాగుర్ బి, జి మణి కుమారి, పద్మ, నాగ మల్లేశ్వరి, దుర్గ, షైనీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయి కుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

మే 9న వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల చట్ట సవరణలు వ్యతిరేకిస్తూ సీపీఐ సభ

విశాలాంధ్ర-తిరువూరు: భారత కమ్యూనిస్టు పార్టీ తిరువూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సుంకర వీరభద్రరావు భవనంలో బాణాల అశోక్ అధ్యక్షతన పట్టణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కె నాగుల్ మీరా మాట్లాడుతూ మే 9 బుధవారం సాయంత్రం ఐదు గంటలకు సీపీఐ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్, విశాలాంధ్ర రోడ్ ఎన్టీమార్ట్ ఆవరణలో జరిగే వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల చట్ట సవరణలు వ్యతిరేకిస్తూ మైనారిటీలపై దాడులను ఖండిస్తూ జరిగే సభను జయప్రదం చేయాలి కోరారు. ఈ సభకు సీపీఐ మండల కార్యదర్శి, సీపీఐ పార్టీ సభ్యులు, తిరువూరు నియోజకవర్గ మైనారిటీ వర్గాలు, లౌకికవర్గాలు, ప్రజాతంత్రవర్గాలు, పుర ప్రముఖులు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశ అనంతరం వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల చట్ట సవరణ వ్యతిరేకిస్తూ మైనారిటీలపై దాడులను ఖండిస్తూ మే 9న భారత కమ్యూనిస్టుపార్టీ నిర్వహించనున్న సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్కె సుభాని, పట్టణ కమిటీ సభ్యులు బాణాల అశోక్, పల్లపు మురళి, పాలమర్తి సునీల్, పార్టీ సభ్యులు పసుపులేటి సత్యం, నరసింహారావు, తోటా పిచ్చయ్య, మేదేపల్లి నరసింహారావు, ఎస్కె యాకోబు, శివ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న పాత్రికేయులు, పత్రికా సంస్థల్లో పని చేస్తున్న మిత్రుల కోసం గతంలో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ అర్బన్ యూనిట్ అధ్వర్యంలో శనివారం (నేడు) ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇఎస్ఐ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో అన్ని విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అంద చేస్తారన్నారన్నారు. అలాగే అమరావతి కంటి ఆసుపత్రిలి ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు కూడా నిర్వహించబడును. శనివారం ఉదయం(05-04-2025) 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులందరూ సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు, ఎంఎస్ఎంఈల మార్కెట్, డిజిటల్ వృద్ధికి ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి కార్యక్రమం

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సహకారంతో భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి కార్యక్రమం కింద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ మేరకు సెర్ప్ ఆంధ్రప్రదేశ్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓలు)కు అవసరమైన మార్కెట్ పరిజ్ఞానం, డిజిటల్ సాధనాలు వారి వ్యాపారాలను విస్తరింప చేయడానికి వ్యూహాలతో సన్నద్ధం చేయడంపై దృష్టి సారించిందన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ కిరాణా వ్యాపారానికి సోర్సింగ్ అవకాశాలను కూడా వర్క్‌షాప్ నొక్కి చెప్పిందన్నారు. దీని వలన రైతులు, వ్యవసాయ వ్యాపారాలు జాతీయ మార్కెట్ అవకాశాలను పొందగలుగుతాయని అన్నారు. ఈ భాగస్వామ్యం లో భాగంగా ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ వ్యాపారాలు, రైతు సంఘాలకు వ్యూహాత్మక మార్కెట్ అనుసంధానిత, ఇ కామర్స్ ఏకీకరణకు తోడ్పాటు అందించడం ద్వారా మద్దతు ఇస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్రంలోని చిన్న వ్యాపారాలు మరియు రైతులకు స్థిరమైన వృద్ధి, జీవనోపాధి కల్పన మరియు ఆర్థిక చేరికను అందించటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా చిన్న వ్యాపారాలు రైతులకు మద్దతు ఇవ్వడం ఫ్లిప్‌కార్ట్ లక్ష్యంలో అంతర్భాగం అని, తాము దృష్టి సారించిన అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి అన్నారు. సెర్ప్‌తో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా, వ్యవసాయ వ్యాపారాలు, గ్రామీణ వ్యాపారులకు అవసరమైన సాధనాలు, పరిజ్ఞానం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వారి పరిధిని విస్తరించడానికి, విజయం సాధించడానికి అవకాశాలను కల్పించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర- పెడన: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం పంపిణీ చేశారు. పట్టణంలో ఆగస్టేశ్వర పురానికి చెందిన రాఘవమ్మకు రూ.81,101లు గూడూరు మం డలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన బొడ్డు బాల మల్లేశ్వరికి రూ.2.56లు రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుం బంలో ఒకరు అనారోగ్యం పాలైతే, కుటుంబం మొత్తం కలత చెందుతుందని మీ కుటుంబంలో వ్యక్తి అనారోగ్యానికి గురికావడం నిజంగా బాధాకరమ న్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య,కట్టా. మునేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50% సబ్సిడీపై పంపిణీ చేసే రుణాలకు మండలానికి కేటాయిం చిన 69 యూనిట్ల కోసం దర ఖాస్తులు దాఖలు చేసుకున్న 579 మందిని శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహి ంచారు. ఆయా గ్రామాలకు అనుసంధానమైన బ్యాంకర్ల సమక్షంలో ఏవో నూతులపాటి శ్రీనివాసరావు సహకారంతోఎంపీడీవో జే. విమాదేవి ఇంట ర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు కాజ, పెద పూడి, భట్లపెనుమర్రు, నిడుమోలు, నిమ్మకూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆంధ్రబ్యాంక్), కూచిపూడి, నిడుమోలు, పెదముత్తేవి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మొవ్వ, కోసూరు ఇండియన్ బ్యాంక్, కూచిపూడి సప్తగిరి గ్రామీణ బ్యాంక్, మొవ్వ బరోడా బ్యాంక్ అధికా రులు హాజరైనారు. అలాగే వివిధ బ్యాంకుల అధికారులు, 16 సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసి స్టెంట్లు హాజరై దరఖాస్తుదారుల ధృవపత్రాలను పరిశీలించారు.

సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె పండుగలో భాగంగా మండలంలోని యలమర్రు గ్రామంలో సిమెంట్ రోడ్లను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి పల్లెలను పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేయటానికి ప్రణాళికను తయారు చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ, సర్పంచ్ కొల్లూరు అనూష, సాగునీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చిలక ఆంజనేయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిలువ మార్గాలు

విశాలాంధ్ర - గుడివాడ : క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉపవాస దీక్షల్లో భాగంగా క్రీస్తు శిలువ మార్గ యాత్రలు పట్టణంలోని పెద్ద ఎరికిపాడు (ఆర్‌సిఎం) చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆర్‌సిఎం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ శ్రీకాంత్‌లు ప్రత్యేక ప్రార్ధనలతో, యాత్రను ప్రారంభించారు. తపస్సు కాలమైన 40 రోజుల పాటు ప్రతి గ్రామంలో శిలువ మార్గా లను గుడ్‌ఫ్రైడే వరకు నిర్వహిస్తారన్నారు. ప్రతివీధిలో 14 స్థలాలు (ఘట్టాలను) వివరిస్తూ శిలువమార్గాన్ని నిర్వహించారు. సిస్టర్స్, ఉపదేశకులు భాస్కర్, ఆంతోని, క్రీసురాజు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

క్వాలిటీ వాల్ యొక్క కొత్త బ్రాండ్, గోల్డెన్ స్వూన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: విస్తరణకు గణనీయమైన అవకాశాలతో ఐస్ క్రీమ్ వర్గం భారతదేశంలో వేగంగా పెరుగుతోందని హెచ్ యూఎల్ బిజినెస్ హెడ్ టోలోయ్ టాన్రిడాగ్లీ అన్నారు. ఈ వర్గాన్ని అందరికీ ఆనందదాయకంగా మార్చాలనే ఆశయంతో, క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వూన్ ను ప్రారంభించిందన్నారు. భారతదేశం డెజర్ట్‌లకు భారీ మార్కెట్ ఐస్ క్రీములు, స్తంభింప చేసిన డెజర్ట్‌ల వర్గం తక్కువగా ఉందని, పెరుగుతున్న కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు ఇంటి రిఫ్రిజిరేటర్ చొచ్చుకుపోవటంతో, వృద్ధికి భారీ అవకాశం ఉందన్నారు. గోల్డెన్ చెంచా ద్వారా, క్వాలిటీ వాల్ ఈ సామర్థ్యాన్ని నొక్కడం, విభిన్న వేసవి ఆనందా లను ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత వినియోగదారులతో కనెక్ట్ అవ్వడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆల్ టైమ్ క్లాసిక్స్ నుండి బోల్డ్ ఇన్నోవేషన్స్ వరకు క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వూన్ నాలుగు ఇర్రెసిస్టిబుల్ ఎంపికలను అందిస్తుందన్నారు. టైంలెస్ వనిల్లా, మిథాయ్ మ్యాజిక్, టు ఇన్ వన్ చాక్లెట్ వనిల్లా, మామిడి వనిల్లా ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్వాలిటీ వాల్ కి బాలీవుడ్ ఐకాన్ బ్రాండ్ అంబాసిడర్ కాజోల్ నటించిన టివిసిని కూడా ప్రారంభించామన్నారు. డిడిబి ముద్రా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ రాహుల్ మాథ్యూ మాట్లాడుతూ ప్రకటన సంక్షిప్త ఉల్లాసకరమైనది సవాలుగా ఉందన్నారు. ఎందుకంటే బంగారు చెంచా వాగ్దానం చేసే ఆనందం యొక్క సారాన్ని మనకు సంగ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. కాజోల్‌తో కలిసి పనిచేయడం, దీని మనోజ్ఞతను చక్కదనం బ్రాండ్ యొక్క ఇమేజ్‌తో సంపూర్ణంగా, దృశ్యపరంగా ప్రతిధ్వనించే ప్రచారాన్ని రూపొందించడానికి ప్రేరణనిచ్చిందని తెలిపారు.

కోదండరామాలయంలో నగలు చోరీ

విశాలాంధ్ర -పమిడిముక్కల: మంటాడ కోదండరామాలయంలో సీతాదేవి మంగళసూత్రాలు నానుతాడు చోరికి గురైనట్టు ఎస్ఐ శ్రీను తెలిపారు. శుక్రవారం సదరు ఆలయంలో ఉత్సవిగ్రాలకు అర్చకుడు తిరుమంజనం నిర్వహిస్తుండగా తెలియని వ్యక్తి ఆలయం లోని సీతమ్మ వారి మెడలోని నానుతాడు మంగళసూత్రాలు అపహరించి పరారయ్యాడని వెంటనే పోలీసులు తెలుపగా వారు సిసి ఫుటేజ్‌లు పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల్ని వ్యతిరేకించండి

– వి వరప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వం అవలంబి స్తున్న ప్రజా వ్యతిరేక నూతన ఆర్థిక విధానాల్ని వ్యతిరేకించాలని ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి వి వరప్రసాద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం విజయవాడలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ విధానంలో మార్పులు చేస్తూ దొడ్డిదారిన గుట్టు చప్పుడు కాకుండా పార్లమెంటులో ఫైనాన్స్ బిల్లు పెట్టారని ఇది పెన్షనర్లకు తీరని నష్టమని పేర్కొన్నారు. ప్రతి పదేళ్లకు జరిగే వేతన సవరణలో ఉద్యోగులకు పెరిగే వేతనాలకు తగ్గట్టుగా పెన్షన్‌లో కూడా పెంపుదల జరిగే మార్పులు చేస్తూ 2026 నుండి రిటైర్ అయ్యే వారికి మాత్రమే వేతన సవరణ అవకాశం కల్పిస్తూ పాత పెన్షనర్స్‌కు మాత్రం మార్పులు లేని విధంగా అది కూడా న్యాయపరమైన జోక్యం లేకుండా చట్టం చేస్తూ దేశ వ్యాపితంగా లక్షలాది మంది పెన్షనర్స్ మెడకు ఉరితాడు వేసున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించు కున్న డిసెంబర్ 17 పెన్షనర్స్ డే హక్కుల్ని కాలరాస్తూ ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో సలహాదారులు కే పూర్ణచంద్రరావు, డి దుర్గారావు, కోశాధికారి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహజయోగ రథయాత్ర బృందం రాక

విశాలాంధ్ర-జగ్గయ్య పేట: సహజయోగాన్ని ఆచరించటం ద్వారా ప్రతి ఒక్కరిలో మంచి లక్షణాలు అలవడతా యని సహజ యోగధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 4నుంచి 10వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో జరగనున్న సహజ యోగ చైతన్య ప్రచార రథయాత్ర తెలంగాణా రాష్ట్రం నుంచి ఎన్‌టి ఆర్ జిల్లాలోని జగ్గ య్యపేట మీదుగా నందిగామ, కంచికచర్ల మీదుగా విజయవాడకు చేరుంది. జగ్గయ్యపేటలో రామకృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో మంచి నడవడికకు, జ్ఞాపక శక్తి పెంపుకు , మానసిక ఒత్తిడి జయించటానికి, సృజనాత్మకత మెరుగుకు సహజయోగ ధ్యానం ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులుపి.వి. రామ్మోహన్‌రావు, చిట్టినేని వెంకట్రావు, ఎన్‌టిఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, భీమవరం జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్.మణి, కృష్ణాజిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ ఎస్.శంకర్, కోకన్వీనర్ డి.జయ శంకర్, విజయవాడ నగర కోఆర్డినేటర్ టి.రవీంద్ర బాబు బృందంలో ఉన్నారు. కె.సౌజన్య, వై.రాజీ, వై.లక్ష్మి, కల్పన, డి.వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు.

6న శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 6వ తేదీన కొత్త పేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంత రావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి) చెప్పారు. శుక్రవారం రామాలయం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు కొత్తపేట బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న శ్రీ నగరాల సీతారామస్వామి వారి బ్రహ్మోత్సవాన్తర్గత కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. 6వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ నగరాల సీతారామస్వామి వారి కళ్యాణ మహోత్సవం విజయవాడ నగర ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరుగుతుందని చెప్పారు. 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నగర పురవీధుల్లో జరుగుతుందని వివరించారు. 8వ తేదీన చూర్ణోత్సవం వసంతోత్సవం, వసంతోత్సవం పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 9వ తేదీన ఉదయం 10 గంటలకు భక్తులకు అన్న అన్నప్రసాద వితరణ జరుగుతుందని, అదే రోజు రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవ, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు. సమావేశంలో దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కమిటీ సభ్యులు పణుకు రమ, కామందుల నరసింహారావు, విజయ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు దేవళరాజు వెంకట సత్య భాస్కర్ అలియాస్ దేవళరాజు వెంకట సత్య భాస్కర్ రామ్ దాస్ తండ్రి శీ మహావిష్ణు, డోర్ నెం.28-19-21, జెండా వీధి రామ మందిరం దగ్గర, అరండల్‌పేట విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియ జేయునది ఏమనగా, నా క్లయింటు యొక్క తల్లి గారైన దేవళరాజు రాధా దేవి గారు ఫస్ట్ అడిషనల్ సబార్డినేట్ జడ్జి కోర్టు, విజయవాడ వారు వేసిన ఆక్షన్ లో హెచ్చుపాట దారుగా వుండి, ఆక్షన్ పొంది, వారి పేరిట కోర్టు వారిచే సేల్ సర్టిఫికేట్ పొంది ది.21-06-1974 న నెం. 123/1974 గా విజయవాడ సబ్ రిజిస్ట్రార్. ఆఫీసు లో రిజిస్ట్రేషన్ కాబడి తదుపరి సదరు రాధాదేవి గారు ది.11-08-2008 న మరణించినారానిన్నీ ది.31-03-2025న నా క్లయింటు సదరు ఆస్థి తాలూకు ఒరిజినల్ దస్తావేజు సేల్ సర్టిఫికేట్ నెం. 123/1974 తీసుకుని ఫొటోస్టాట్ తీయించు నిమిత్తం వెళ్ళచుండగా, విజయవాడ అరండల్‌పేట, ప్రాంతములో తన ఆస్థి తాలూకు ఒరిజినల్ దస్తావేజు నెం:123/1974 ను పోగొట్టుకొనినారు. ఎంత వెతికిననూ సదరు దస్తావేజు దొరికియుండ లేదు. కావున సదరు. దస్తావేజుపై ఏ విధమైన తనఖాలు గాని, ఎటువంటి లావాదేవీలు గానీ జరిపినను అవి చెల్లవు అని తెలియజేయుచున్నాము. సదరు దస్తావేజ తాలూకు ఆస్తి నా క్లయింటు స్వాధీనం లోనే వున్నది. ఈ దస్తావేజు ఎవరికైనను దొరికినచో దయచేసి ఈ క్రింది అడ్రస్ లో తెలియజేయగలరు.

విజయవాడ
04-04-2025

ఇట్లు
అంబటి సంజయ్ కుమార్.,
న్యాయవాది,
24-25-13, 2nd క్రాస్ రోడ్డు,బాలాజీ నిలయం,
దుర్గాపురం, విజయవాడ-3. Cell: **9849077779**

పొగాకు రైతులను ముంచిన అకాల వర్షం



విశాలాంధ్ర గన్నవరం : పొగాకు రైతులను ముంచిన అకాల వర్షం గన్నవరం మండలం బీబీ గూడెం రైతు గొంది వెంకట శోభన చలపతిరావు 4 ఎకరాలలో పొగాకు చేయగా ఎకరానికి 40 క్విం టాలు దిగుబడి క్వింటాకు రూ.15 వేలు చొప్పున రేటు పలుకుతు ఒదని రేపు మా పో అమ్మే వాళ్ళం ఇంతలో అకాల వర్షం వచ్చి పొగాకు తడిసిపోయిందని సుమారుగా రూ.6 లక్షలు నష్టపోయేమని రైతు గొంది వెంకట శోభన చలపతి రావు ఆవేదన వ్యక్తం చేశారు రైతు లబోదిబో అంటున్నాడు అలాగే బీపీ గూడెం రైతు తమ్మిశెట్టి రఘుబాబు 3 ఎకరాలు 30 క్వింటాలు దిగుబడి గొల్లపల్లి రైతు యల మదల సుబ్బా రావు 4 ఎకరాలు వేగా 35 క్వింటాలు పంట చేతికి వచ్చే టైంలో అకాల వర్షం వచ్చి పొగాకు రైతులు ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతు అప్పుల అప్పులతో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రకటన

మా క్లయింటు శ్రీ కోడె విష్ణు తండ్రి. వెంకటేశ్వరరావు గారి ఉత్తర్వులననుసరించి యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

ది. 30-03-2025 తేదీన మధ్యాహ్నం గం॥ 11-00 లకు మా క్లయింటు శ్రీ కోడె విష్ణు, తండ్రి. వెంకటేశ్వరరావు గారికి ప్రాపర్టీకి చెందిన నాలుగు సేల్ డీడ్స్ నెం. 507/2015, 508/2015, 509/2015 మరియు 510/2015లను ఒక పాలిథీన్ బ్యాగ్‌లో పెట్టుకొని, ఆటోలో కామయ్యతోపు సెంటర్ నుండి పెనమలూరు వెళ్లుచున్నారు. ఆటో దిగి చూచుకొనగా, డాక్యుమెంట్స్ ఉంచిన పాలిథీన్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయినారు. నా క్లయింటు ఆ ఆటోను వెతుకుట కొరకు చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆటో రిజిస్ట్రేషన్ నెంబరు గుర్తించుకోలేక పోవడం వలన ఆ ఆటోను గుర్తించలేకపోయారు.

మా క్లయింటు కోడె విష్ణు, తండ్రి. వెంకటేశ్వరరావు గారి స్థిరాస్తికి సంబంధించిన సదరు దస్తావేజులు ఎవరికైన దొరికినయెడల ఈ దిగువ తెలిపిన అడ్రస్ నందు అందజేయగలరని కోరుతున్నాము. సదరు దస్తావేజులను ఎవరైన అక్రమముగా స్వాధీనములో ఉంచుకొని, ఎవరైనను ఎట్టి క్లయిములైనను చేసినయెడల సదరు క్లయిములు మా క్లయింటును బైండు చేయజాలవు. అట్టి వారిపై తగిన చర్యలు తీసుకొనబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
పిళ్ళారవి, పిళ్ళా సునీత, న్యాయవాదులు
సామారంగంచౌక్, విజయవాడ-520 001. ✆ 98481 10109

సాధారణ కాన్పులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-తిరువూరు: ప్రభుత్వ వైద్యశాల ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం గర్భిణీ స్త్రీలకు సాధారణ కానుపు యొక్క ఉపయోగాలను అవగాహన కల్పించడం జరిగింది. సూపరింటెండెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ గార్గేయి మాట్లాడుతూ సాధారణ కాన్పుల వల్ల తల్లి త్వరగా కోలుకోవడంతో పాటు కాన్పు జరిగిన మొదటి గంటలోనే తల్లి బిడ్డకు పాలు ఇవ్వొచ్చని అన్నారు. సాధారణ కాన్పుల వల్ల ఆసుపత్రిలో రెండు లేదా మూడు రోజులు ఉన్నా సరిపోతాయని, అదే సిజేరియన్ కాన్పుల వల్ల ఆసుపత్రిలో వారం రోజుల వరకు ఉండవలసి వస్తుందని తెలిపారు. సాధారణ కాన్పుల వల్ల తల్లి త్వరగా కోలుకోవడం వలన కాన్పు జరిగిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వచ్చని దానివల్ల బిడ్డకు వ్యాధి నిరో ధక శక్తి పెరుగుతుందనీ మరియు బిడ్డ శారీరకంగా మానసికంగా బాగా ఎదుగు తారని తెలిపారు. సాధారణ కాన్పు వల్ల తల్లి త్వరగా కోలు కొని ఆరోగ్యంగా ఉంటుంది అని తెలిపారు. ఆపరేషన్ చేస్తే అంటువ్యాధులు బ్లీడింగ్ మొదలకు సమస్యలు రావచ్చని, తదుపరి కాన్పులలో కూడా సమస్యలు రావచ్చన్నారు. అందువలన సాధారణ కాన్పులు సిజేరియన్ కాన్పుల కంటే మంచి దని డాక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ ఎస్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ విజయవాడ
M.A. No. 78/2024 IN A/ 148/2018
IN CC/172/2018

పిట్టల కృష్ణ కిషోర్ ... అర్జీదారుడు
మరియు
1. మిత్రా హోండా
2. హోండా మోటార్ సైకిల్స్ & స్కూటర్ ఇండియా లిమిటెడ్ ... ప్రతివాదులు

గా॥ కమీషన్ వారి ఆదేశాలు ప్రకారం
నోటీసు: మిత్రా హోండా
డోర్ నెంబర్: 36-26-126/11, ఏలూరు రోడ్, చుట్టుగుంట సెంటర్, సీతారాంపురం, విజయవాడ-520004.

పైన తెలిపిన పిటిషన్ నందు కమీషన్ వారి ఆదేశాల ప్రకారం పై పేర్కొన్న 1వ ప్రతి వాదికి దావా నందు నోటీసును పత్రిక ప్రకటన ద్వారా పైన తెలిపిన ప్రతివాది కమీషన్ నందు వాయిదా తేదిన అనగా ది. 21-04-2025న ఉ॥10.30 గంటలకు మీరు స్వయంగా కానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ తప్పని సరిగా హాజరు మీ యొక్క సంజాయిషీని దాఖలు చేయవలసినదిగా ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు అందుకొని హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేసినారు. లేని యెడల మీ పరోక్షంలో కమీషన్ వారు ఏకపక్షంగా విచారణ జరుగును.

// కమీషన్ ఉత్తర్వులతో //

ఇట్లు
గంగిశెట్టి ఉమాశంకర్
అర్జిధరుని తరుపు న్యాయవాది, విజయవాడ

CHANGE OF NAME

I, SREENIVASA RAO CHOUDI, (Old Name) S/o RAMARAO CHOUDI, resident of Flat No. 501, Kuchipudi Homes, Behind Ayush Hospital, Sri Ramachandra Nagar, Vijayawada-520008, NTR District, A.P. I have changed my name as **SRINIVASA RAO CHOUDI, (New Name) S/o RAMARAO CHOUDI** Hereafter, my Name is known as **SRINIVASA RAO CHOUDI, (New Name) S/o RAMARAO CHOUDI** for all purposes.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని అప్పికట్ల గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, కొడాలి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి ట్రస్ట్ అధినేత కొడాలి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మరియు జనరల్ వైద్యులు సుమారు 236 మంది రోగులను పరీక్షించి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ హైదరాబాద్ చే ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ప్రకాశరావు ఒక ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంబంధిత రోగులు పాల్గొన్నారు.

టాక్సీ కార్మికుల సమస్యల పరిష్కారానికి

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : టాక్సీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో విజయ టాక్సీ సొసైటీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సమావేశం యూనియన్ కార్యదర్శి అబ్దుల్ కుదూస్ అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి అబ్దుల్ కుదూస్ నివేదికను కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు సభ ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణారంగం తీవ్రమైన సమస్యలు ఎదు ర్కొంటుందని ప్రత్యేకించి టాక్సీ ఆటోడ్రైవర్లు జీవనం సాగించ లేని దుస్థితిలో ఉన్నారని ఏ ప్రభుత్వం వచ్చినా కార్మిక సమస్యలు పరిష్క రిస్తామని చెప్పి ఏరుదాటి తెప్ప తగలబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా డ్రైవర్ల సమస్యలకు రక్షణ లేకుండా పోయి ందని, భద్రత లేదని ప్రమాద బీమా లేదు, వాహన మిత్ర ఆగిపో యిందని తక్షణమే ప్రభుత్వం తమఎన్నికల వాగ్దానం మేరకు ఎన్ని కల్లో ఏదైతే వాగ్దానం చేశారో రవాణా ఆటో టాక్సీ కార్మి కులకు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వేదికపై యూనియన్ కార్యదర్శి అబ్దుల్ కుదూస్ ఏఐటీయూసీ నాయకులు మన్యం సుబ్బయ్య నాయకులు బుద్ధ సాంబశివ రావు కడియాల సాంబశివరావు కోశాధికారి వాసు సింహాచలం సాయి చంటి పాల్గొన్నారు. అనంతరం జనరల్ బాడీ సమావేశంలో యూనియన గౌరవ అధ్యక్షులుగా వజ్జే పద్మలత, అధ్యక్షులు దోనేపూడి శంకర్‌ను ఏకగ్రీవంగా సమావేశం ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ నుంచి ప్రదర్శ నగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల యూనియన్ బోర్డుకి దోనేపూడి శంకర్, పద్మలత పూలమాలలు వేసి కీర్తిశేషులు వజ్జే సుబ్బారావు వజ్జేరమేష్ గార్లకు శ్రద్ధాంజలి ఘటించారు.

న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మహిళలు, చిన్నారులు రక్షణ కోసం న్యాయ వ్యవస్థలో నూతన చట్టాలు ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని రైల్వే కోర్టు న్యాయమూర్తి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్ వి శర్మ తెలిపారు. శుక్రవారం ఆదిత్య కాలేజీలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి ఆర్.వి.శర్మ మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలపై కఠినంగా శిక్షించడానికి ఫోక్సో చట్టం ఉందని దీనిలో దోషులపై సత్వరం చర్యలు తీసు కోవడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే విధంగా చట్టా లను రూపొందించారన్నారు. మహిళలు కూడా ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రభుత్వ రైల్వే పోలీస్ (జి.ఆర్.పి) సి.ఐ జేవీ రమణ, ఆదిత్య కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

ఆమోదించుకోవడం దుర్మార్గమన్నారు. ఎంపీలలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేని బీజేపీ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాపాడానికే వక్ఫ్ బోర్డు సవరణ అని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 50 శాతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, మత నియమాలు కోసం ఇతర కార్యక్రమాలకు వాడకూడదన్నారు. ఈ బిల్లుతో ఆ నియమాలను తుంగలో తొక్కి పెద్ద స్థాయిలో వక్ఫ్ భూములను కలెక్టర్‌ల ద్వారా ప్రభుత్వం ఆక్రమించుకోవచ్చని లేదా కార్పొరేట్లకు కట్టబెట్టవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ముస్లిం వ్యతిరేక చట్టానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మద్దతు తెలపడం దుర్మార్గమని అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే ముస్లిం వర్గానికి ద్రోహం చేసిన వారిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు.

అక్రమ మద్యం ధ్వంసం

వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 14405, డయల్ 100, 112 లేదా సమీప పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని, అలా అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి. నాయుడు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి. సత్యన్నారాయణ, సబ్ డివిజనల్ డీఎస్పీలు సిహెచ్. రాజా టి. విద్యశ్రీ, వి. ధీరజ్ నీల్, సిహెచ్ శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ జి. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ ఎన్. రాజా, డిసిఆర్‌బి. ఇన్స్పెక్టర్ ఎస్వీఎస్. సూర్యనారాయణ, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో స్థిరంగా ఎరువుల వాడకం

- లోక్‌సభలో ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: అమ్మోనియం ఫాస్ఫేట్ ఎరువు, పొటాష్ తదితర ఎరువుల వాడకం గత దశాబ్ద కాలంలో పెరిగినా సూక్ష్మ పోషకాలను పెంచే చర్యలు చేపట్టినందువల్ల ఎరువుల వాడకం మరింత పెరగకుండా ఆగినట్లు ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), దగ్గుమళ్ల ప్రసాదరావు వేసిన ప్రశ్నకు కేంద్ర రసాయనాలు, ఎరువుల ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా జవాబు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా వారీ గణాంకాల సమాచారాన్ని కేంద్రమంత్రి ఇచ్చారు. 2024-25లో మట్టిలోవుండే సూక్ష్మ పోషకాలు నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, ఆర్గానిక్‌కార్బన్, మట్టిలోని లవణాల స్థాయికి సంబంధించి 4.22 లక్షల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో 16400 శాంపిల్స్ తీసుకుని పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్‌గా భీముని అనంతలక్ష్మి

విశాలాంధ్ర -పెడన : కూటమి ప్రభుత్వం శుక్రవారం నామినేటెడ్ పదవుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో జనసేన పార్టీకి చెందిన భీముని అనంతలక్ష్మి పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్‌గా నియమితుల య్యారు. కూటమి భాగస్వామ్య పార్టీలకు న్యాయమైన వాటా కల్పిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. భీముని అనంతలక్ష్మి నియామకాన్ని జనసేన శ్రేణులు హర్షంగా స్వాగతించాయి. రైతులకు మరింత మేలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అనంతలక్ష్మి తెలిపారు. ఈ నియామకంతో పెడన మార్కెట్ యార్డ్‌లో రైతుల సంక్షేమానికి మరింత దోహదం జరుగుతుందని అంచనా. స్థానిక నేతలు, జనసేన కార్యకర్తలు భీముని అనంతలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్

ఇన్‌ఛార్జ్‌గా జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కార్యదర్శి వేములపల్లి రవికుమార్, భోకినాల విజయ కుమార్, ఐవివి రామారావు కలిసి ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మను మర్యాదపూర్వకంగా కలిసారు. వారు సానుకూలంగా స్పందించి పర్సన్ ఇన్చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రంథాలయాల అభివృద్ధి పై చర్చించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్చార్జ్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

లిడ్‌క్యాప్ టెండర్లలో రూ.2 కోట్ల నిబంధన తొలగించాలి

- ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనపర్తి గుప్తా

విశాలాంధ్ర-విజయవాడ : చర్మకార ఉత్పత్తి రంగంపై ఆధారపడి జీవిస్తున్న చిన్న చర్మకార తయారీ దారులు, సరఫరా దారులకు సైతం అవకాశం కల్పించేందుకుగాను లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్‌క్యాప్) ద్వారా ఇటీవల జారీజేసిన బిడ్ల స్వీకరణలో రూ. 2కోట్ల వార్షిక టర్నోవర్ నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనపర్తి గుప్తా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల చెప్పులు, తోలు వస్తువులు, సంబంధిత యాక్సరీస్ తయారీ, సరఫరాకు సంబంధించిన బిడ్లను ఆహ్వానిస్తూ లిడ్‌క్యాప్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ద్వారా మార్చి 27న టెండరు ప్రకటన జారీజేశారని గుర్తుచేశారు. బిడ్లు వేసే చర్మకార ఉత్పత్తిరంగం వారికి లిడ్‌క్యాప్‌తో ఉపాధి కోసం గత మూడు సంవత్సరాలలో.. ఏదైనా ఒక సంవత్సరం కనీసం రూ. 2కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉండాలన్న నిబంధన విధించడం అన్యాయమని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడువిడుదల చేసిన జీవోకు, లిడ్‌క్యాప్ ఎండీ జారీజేసిన టెండరు ప్రకటనకు పొంతన లేకుండా ఉందన్నారు. ఈ విధానం వల్ల చర్మకార రంగంపై ఆధారపడిన లక్షలాది మంది చేతివృత్తిదారులకు బిడ్లు వేసే అవకా శాన్ని కోల్పోతారని, ఈ బిడ్లలో ప్రధానంగా మాదిగ సోదరులకు అవకాశం ఇవ్వాలని కోరారు. డాక్యుమెంట్ దాఖలకు ఏప్రిల్ 15 వరకు గడువు విధించారని, ఆ లోగా తక్షణమే లిడ్‌క్యాప్ డైరెక్టర్ స్పందించి మరో టెండరు ప్రకటన జారీ చేయాలని కోరారు. చిన్న చర్మకారు తయారీ దారులు, సరఫరాదారులకు సైతం బిడ్లలో భాగస్వాములయ్యేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అగ్నిమాపక నివారణ పరికరాలు తనిఖీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నివారణకు శుక్రవారం వీఎంసీ ఫైర్ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక గవర్నర్ పేటలోని అశ్వా మల్టీ స్పెషలిటీ హాస్పిటల్, బెంజ్‌సర్కిల్ సమీపంలోని ఆర్టీసీ కాలనీ మేరీ స్టెల్లా కాలేజ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాద నివారణకు పరికరాలను ఉపయోగించు విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఏ విధంగా పనిచేస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేమి ఉండాలి తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

నేటి పిల్లలే రేపటి పౌరులు

వీఎంసీ డిప్యూటీ కమిషనర్ జి.సృజన

విశాలాంధ్ర-విజ యవాడ కార్పొ రేషన్ : నగరపాలక సంస్థ కమిష నర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు వీఎం సీ డిప్యూటీ కమిషనర్ జి.సృజన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులకు చిన్నతనం లోనే సింగిల్ యూస్ ప్లాస్టిక్ అనర్ధాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, ఫాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి తద్వారా వారిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, న్యాయ నిర్ణయతలగా వ్యవహరించారు.

బీసీ రుణాల మంజూరు పత్రాలు స్వీకరణ

విశాలాంధ్ర-ఏ కొండూరు : బీసీ ఓసీ కాపు ఈ బీసీ ఆర్యవైశ్య మేదర తదితర కార్పొరేషన్ రుణాలకు సంబం ధించిన రుణ మంజూరు పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఏ కొండూరు మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించి రుణ లబ్ధిదారుల నుండి అర్హత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకున్నట్లు ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకొని బ్యాంక్ ద్వారా రుణం తీసుకొని మీరు ఎంచుకున్న యూనిట్ నెలకొల్పుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. ప్రతి కార్పొరేషన్ నుండి 50 శాతం రుణం సబ్సిడీ రూపంలో వస్తుందని మిగతా రుణం బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తారని ఆయన చెప్పారు అలానే మొత్తం రుణ దరఖాస్తులు 626 రాగా ఈరోజు జరిగిన ఇంటర్వ్యూలకు 557 మంది లబ్ధిదారుల హాజరైనట్లు ఆయన చెప్పారు అలానే లబ్ధిదారులు రుణాలకు సంబంధించిన సబ్సిడీని మండల లోని ఏ కొండూరు ఇండియన్ బ్యాంక్ చీమలపాడు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ కంభంపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు మొత్తం సబ్సిడీ రుణం రూ. 91 లక్షలుమంజూరైనట్లు తెలిపారు.

ప్రతి రిజర్వాయర్‌ను శుభ్రం చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి రిజర్వాయర్‌ను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్, ఎల్ఆర్ కాలనీ, నల్లచెరువు, చంద్ర మౌళినగర్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా తాగునీటి సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాను గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. అలాగే పైప్ లైన్ లీకులను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించాలని, తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, కార్మికులు మధ్యాహ్నం సమయంలో డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్ మధ్యాహ్నం సమయంలో కార్మికుల పనితీరుని మెరుగ్గా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, కమర్షియల్ సంస్థలు వ్యర్థాలను రోడ్ల మీద వేయకుండా నోటీసులు ఇవ్వాలని సూచించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజ్ఞ స్కూల్ డే సెలబ్రేషన్స్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యా సంస్థల స్కూల్ డే సెలబ్రేషన్స్ 2025 శుక్రవారం ఘనంగా జరిపారు. తెల్లటి యూనిఫామ్ ధరించిన విద్యార్థులు అత్యంత క్రమశిక్షణతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, కార్యదర్శి నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పేద వెనుకబడిన ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. బెస్ట్ ఇన్ స్పెల్ ది, బెస్ట్ ఇన్ లుసిడా, బోల్ ఇంగ్లీష్, నాలెడ్జ్ వెస్ట్ విన్నర్, బెస్ట్ ఇన్ యూనిఫామ్ అప్పీరెన్స్, బెస్ట్ ఇన్ అటెండెన్స్, వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాయుడు చక్రనాగ్, ప్రిన్సిపాల్ అరుణ సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య వైన్‌షాప్ వద్దంటూ మహిళల నిరసన

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలోని నందులపేట, ఘంటావారి వీధిలో గల మూత బావి సెంటర్‌లో నివాసస్థలాల మధ్య వైన్‌షాప్ వద్దంటూ శుక్రవారం మహిళలు ఆందోళన చేపట్టారు. పార్టీలకతీతంగా పలువురు పెద్దలు ఈ నిరసనలో పాల్గొని మహిళలకు మద్దతునిచ్చారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, ప్రముఖులు, సీతారామయ్య, శివ, శ్రీరామ్, అజయ్‌కుమార్, త్రినాథ్, గణేష్, సురేంద్ర, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు..

విశాలాంధ్ర-పెదనందిపాడు : వరగాని గ్రామానికి చెందిన తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తులు వెలగా గంగాధర్, వెలగా చౌదరిలు శుక్రవారం కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. స్వామి దయతో క్షేమంగా కాలినడక యాత్ర పూర్తిచేసుకుని రావాలని వారికి గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

గ్రామాల్లో ఏఓ పర్యటన

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ అధికారిఫి కె.కిరణ్మయి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కల్లాలలో ఆరబోసి ఉన్న మొక్కజొన్నలను పరిశీలించి రాబోవు రెండు రోజుల్లో వర్షంపడే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం ఆస్తి పన్నును ఈ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపిందని, 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆస్తి పన్నును ఈనెల 30 నాటికి చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీఓ. 267 జారీ చేసిందన్నారు. 2025-26 డిమాండ్‌ను మున్సిపల్ శాఖ ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్నందున, ఈ నెల 7నుంచి 5 శాతం రాయితీని వినియోగించుకోవచ్చన్నారు. ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని ఈ ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు.

విటమిన్ 'సి'రి... ఆరోగ్య సిరి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విటమిన్ 'సి'... ఆరోగ్య సిరిగా పనిచేస్తుందని ప్రముఖ సామాజికవేత్త సంగిరెడ్డి హనుమంతరెడ్డి అన్నారు. జాతీయ విటమిన్ 'సి' దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక భారత్ పేట 1వ లైనులోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో శుక్రవారం విటమిన్‌ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హనుమంతరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఆస్తులు లేకపోయినా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మనం తీసుకునే ఆహారాన్ని బట్టి ఆరోగ్యం ఉంటుందని అన్నారు. విటమిన్ సి ఉసిరికాయలో అధికంగా దొరుకుతుందని చెప్పారు. ఉసిరిలో ఉండే కెరాటిన్ కంటిచూపును మెరుగుపరుస్తుందన్నారు. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. చర్మం, పళ్లు, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతుందని, కొవ్వును కరిగిస్తుందని, క్యాన్సర్‌ను నిరోధిస్తుందని చెప్పారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కలిగించడం వలన ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రులు శ్రద్ధ వహించి ఆరోగ్యకరమైన సి విటమిన్ లభించే ఆహారాన్ని అందజేయాలని సూచించారు.

కూల్‌డ్రింక్ ఫ్యాక్టరీ తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నగరానికి సమీపంలోని గ్రామంలో కూల్‌డ్రింక్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుంటూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ హరిబాబు, బీరాల నాగేశ్వరరావు, గాయకోటి బేబీ సరోజినీ, మునిపల్లె కవితతో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌తో తనిఖీ చేశారు. దీంతో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ యజమాని ప్యాకేజింగ్ లైసెన్సు డిపార్ట్‌మెంట్ నుండి తీసుకోలేదు.. అక్కడ ఉన్న ఎలక్ట్రానిక్ కాటాకు స్టాంపింగ్ వేయించలేదు.. ప్యాకేజీ కమోడిటీ చట్టం ప్రకారం ఒక మిల్లి గ్రాము ఖరీదు నమోదు చేయలేదు. కూల్‌డ్రింక్ యాపిల్, ద్రాక్ష, పైనాపిల్, మామిడి రసాయన రంగులు, సాక్రిన్‌తో తయారు చేయడాన్ని ప్రశ్నించగా పల్ప్‌తో చేస్తున్నామని బకాయించాడు. ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ కేసు నమోదు చేయగా తదుపరి విజిలెన్స్ కమిటీ సభ్యులు మొత్తం ఫ్యాక్టరీని సందర్శించిన విషయం గుంటూరు ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారి నూతలపాటి పూర్ణ చంద్రరావుకు వివరించి ఫ్యాక్టరీ వారు నడుపుతున్న ఆర్వో ప్లాంట్ నీరు సేకరించి మైక్రో బయాలజీ, కెమికల్ ఎనాలసిస్ పంపాలని చిన్నపిల్లల ఆరోగ్యమునకు హాని కలుగజేసే డ్రింక్స్ శాంపిల్స్‌ను టెస్టింగ్‌కు పంపాలని కోరినట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజారోగ్య రక్షణలో పారిశుధ్యం కీలక పాత్ర పోషిస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పశ్చిమ శాసనసభ్యులు గళ్లా మాధవితో కలిసి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుధ్యంపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్య పర్యవేక్షణ కోసం శానిటరీ డివిజన్లను 32కు పెంచటంతో పాటు అవసరమైన పుష్ కాట్స్, ప్లాస్టిక్ బిన్స్, ఆటోలు, ట్రాక్టర్లు, అదనపు కార్మికులను కేటాయించామన్నారు. ప్రతి ఇంటి గేటుకి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఏర్పాటు చేసి, కార్మికులు చెత్త సేకరణకు వచ్చినప్పుడు తప్పనిసరిగా స్కాన్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందర రామి రెడ్డి, వెహికల్ షెడ్ డీఈఈ సతీష్ పాల్గొన్నారు.

కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : లింగంశెట్టి అసోసియేట్స్ అండ్ కన్సల్టెన్సీ అధినేత లింగంశెట్టి కిషోర్ కుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఉండవల్లి శుభోదయం సూపర్ మార్కెట్ ఎదుట 250 మంది కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. 800 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉండవల్లి సెంటర్‌లో, శుభోదయం సూపర్ మార్కెట్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను టీడీపీ తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు ప్రారంభించి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వంశీ హైస్కూల్‌లో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ లింగంశెట్టి కిషోర్ కుమార్ జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. లింగంశెట్టి కిషోర్ కుమార్ మాట్లాడుతూ పేదలకు స్వయంగా భోజనం వడ్డించడం సంతోషంగా ఉందని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం వలన అనేక ప్రాంతాల నుంచి పనుల మీద నిత్యం ఉండవల్లికి వచ్చిన ప్రజలకు తాగునీరు లేక ఇబ్బంది రాకూడదన్న ఉద్దేశంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంగాల సాంబశివరావు, జంగాల వెంకటేష్, సీపీఐ నాయకులు మానికొండ డాంగే, శివ, భాస్కర్, గోపాలం కొండయ్య, గోపాలం వాసు, తాడిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : అన్నపూర్ణ థియేటర్ దగ్గర గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, బీజేపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, పద్మశాలి సంఘం కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాథమిక విద్య అనేది ప్రతి వ్యక్తికి అత్యంత కీలకమైనదన్నారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ కొండ నవనీత్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నంబూరులో కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పెదకాకాని : ఆంధ్రప్రదేశ్ మార్కెట్ ఫండ్, నాఫెడ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధరపై మినుములు క్వింటా రూ.7,400లు, పెసలు క్వింటా రూ.8,682లు కొనుగోలు కేంద్రాన్ని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రాన్ని పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. మండల టీడీపీ నాయకులు, రైతులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో సుమారు పదివేల ఎకరాలలో రైతులు పెసర పంట పండించారని, రైతులు దళారుల మాట విని తక్కువ ధరకు అమ్ముతున్నారని తెలిసి రైతులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో పెసలు క్వింటా రూ.8,682లు ప్రభుత్వం వారితో కొనుగోలు చేసే విధంగా చేసిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో పంట పండించిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కూటమి ప్రభుత్వ రాకతో ఉద్యోగుల జీవితాల్లో ఆనందం: ఏపీ ఎన్జీఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉద్యోగులు ఎదురు చూస్తున్న డీఏ మంజూరు.. పీఆర్సీ కమిటీ ఏర్పాటు త్వరలో జరుగుతుందని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్, రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ రిక్రియేషన్ హాలులో గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్, సంఘం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జగదీష్, రాంప్రసాద్ మాట్లాడారు. రూ.7వేల 2 వందల కోట్లు బకాయిలు చెల్లించినందుకు ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామన్నారు. జిల్లా కార్యదర్శిగా శ్యామ్ సుందర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శ్రీవాణి, మహిళా సంయుక్త కార్యదర్శిగా విజయలక్ష్మీ, జిల్లా సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ జానీబాషా, కృష్ణ కిషోర్, విజయ్‌బాబులను కో-ఆప్షన్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటరెడ్డి, పీవీ నాగేశ్వరరావు, ధనుంజయ నాయక్, శ్రీధర్‌రెడ్డి, సూరి, కళ్యాణ్ కుమార్, జిల్లాలోని అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణం లో శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా శుక్ర వారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్థానిక 25వ వార్డు పెద్దచెరువులో పర్యటించారు. సైడ్ కాలువలలో పూడికను తీశారు. పిచ్చి మొక్కలు గడ్డిని తొలగించారు. స్థానికులతో వార్డు లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గం పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే తన లక్ష్యమని ప్రతి రోజు వార్డు వార్డు తిరుగుతూ మున్సిపాల్ కార్మికులను పార్టీ కార్యకర్తలను వెంట తీసుకొని కాలువలను రోడ్లను, ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దాచేపల్లి : గోపాలం భ్రమరాంభ రామస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసానపల్లిలోని గీతా గురుకులం ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అని శెట్టి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు గోపాలం శివన్నారాయణ, నవులూరి క్రాంతికుమార్ రెడ్డి వస్తున్నారు. బీపీ, షుగర్, పక్షవాతం తదితర వ్యాధులను పరీక్షిస్తారు. ఉదయం 6 నుంచి 10 గంటల లోపు తగిన రిపోర్టులతో హాజరుకావాలని కోరారు.

మండలంలో ఆర్డీవో పర్యటన

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలో పల్నాడు జిల్లా ఆర్డీవో మధులత శుక్రవారం పర్యటించారు. తిమ్మాపురంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. స్థానిక వసంత స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం సర్కారు డొంకను తన సొంత అవసరాలకు వాడుకొని, తమ భూమిని డొంకకు కేటాయిస్తామన్న ప్రతిపాదనపై సభలో చర్చించారు. అలాగే తుర్లపాడు గ్రామానికి చెందిన తల్లపునేని పద్మలత 25 సంవత్సరాలక్రితం తమ స్థలం ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణంలో పోయిందని నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారించారు. కార్యక్రమంలో యడ్లపాడు ఎమ్మార్వో విజయశ్రీ, ఎంపీడీవో హేమలత, ఆర్ఐ సుబ్బారావు, సర్వేయర్ సురేంద్ర పాల్గొన్నారు.

న్యూటన్స్ విద్యార్థులకు ఐటీ ఉద్యోగాలు

విశాలాంధ్ర-మాచర్ల: మండలంలోని అలు గురాజుపల్లె న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్ మహేంద్ర హైదరాబాద్ బ్రాంచ్ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తమ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులచే ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీతో విద్యా బోధన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే తమ క్యాంపస్ ద్వారా వేలాదిమంది విద్యార్థులు ఎన్నో ఉపాధి అవకాశాలను పొందినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రు.3.5 లక్షల వార్షికాదాయం ఉంటుం దన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రెడ్డి, టిపి ఓ రామ్మోహన్ రెడ్డి, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూనే సేవా కార్యక్రమాల్లో వారు భాగస్వాములు కావడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇటీవల ఉగాది సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ప్రెస్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అడపా అశోక్‌కుమార్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి షేక్ దరియావలి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తన నివాసంలో వారిని శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ జర్నలిస్టులు కేవలం వార్తల సేకరణకే పరిమితం కాకుండా సామాజిక సేవలోనూ అసాధారణమైన పాత్ర పోషించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు, టీడీపీ నియోజ కవర్గ సమన్వయకర్త ఛైర్మన్ నెల్లూరి సదాశివరావు, రూరల్ మండల అధ్య క్షులు జవ్వాజి మదన్మోహన్ యడ్ల పాడు మండల పార్టీ అధ్యక్షుడు కామి నేని సాయిబాబా, పట్టణ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మురుకొండ మల్లిబాబు, ఎడ్లపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్త వాసు, రాష్ట్ర రైతు నాయకులు నాగపూర్ణ చంద్రరావు, 19వ వార్డు కౌన్సిలర్ నసీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

కంచేటి సాయి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: నియోజకవర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు (సాయి) జన్మదిన వేడుకలను స్థానిక ఆంజనేయ స్వామి వారి విగ్రహం సెంటర్లో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. యువత అభిమాని కంచేటి సాయి పేరుతో ఉన్న కేకును కోసి మిఠాయిలు పంచుకొంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ సాయం కోసం వెళ్లిన వారికి లేదు అనకుండా వారి సమస్యల మూలాలను కనుక్కుని వాటిని పరిష్కరిస్తూ ప్రజల నుంచి అంతులేని అభిమానాన్ని కంచేటి సాయి సంపాదించుకున్నారని కొనియాడారు. ఆంజనేయ స్వామి వారి విగ్రహం సెంటర్‌కి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయా రకాల సేవా కార్యక్రమాలను చేపట్టారు. చామర్రు గ్రామంలో జంపాని నాని ఆధ్వర్యంలో వేంకటరాజు ట్రస్ట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో చదువుకుంటున్న పిల్లలకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండలం టిడిపి అధ్యక్షులు నందిగామ ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాస రావు, మొక్కపాటి గిరిబాబు, నల్ల మేకల వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, షేక్ జానీ, మహిళా కార్యదర్శి అనుపుకల జానీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

విజయవంతంగా క్రైస్తవ శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - వినుకొండ : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా వినుకొండ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన శాంతియుత ర్యాలీ విజయవంతంగా జరిగింది. తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ర్యాలీలో పాస్టర్ ప్రవీణ్ పగడాల వృత్తికి సంతాపంగా బాధ తప్త హృదయాలతో వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం, ఈపూరు, నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ పట్టణ గ్రామీణ ప్రాంతాలతో పాటు ప్రకాశం జిల్లాలోని కురిచేడు, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం ప్రాంతాల నుండి కూడా క్రైస్తవ నాయకులు, సంఘ కాపర్లు క్రైస్తవ సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ జేఏసీ నాయకులు మాట్లా డుతూ దేశ అభివృద్ధికి క్రైస్తవులు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశా లతో పాటు, రైలు, రోడ్డు, రవాణా మార్గాల తోపాటు, అనేక సౌకర్యాలు కల్పించి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. పాస్టర్ కుటుంబానికి న్యాయం చేసి క్రైస్తవ నాయకులకు, సంఘాలకు రక్షణగా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలని కోరారు.

చిన్నారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: స్థానిక బాలయ్య నగర్‌లో రెండు సంవత్సరాల చిన్నారి బాలిక బర్డ్ ఫ్లూతో చనిపోవటం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం బాలిక కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరు జిల్లాలను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్లుగా డిక్లేర్ చేశారని, పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక బాలిక బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోతే మరి పల్నాడు జిల్లాను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్‌గా ఎందుకు డిక్లేర్ చేయలేదని ప్రశ్నించారు. ఈ ఏరియాలో 10 కోళ్లు కూడా బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయారని చెబుతున్నారని, దీని మీద కూడా విచారణ చేయాలని కోరారు. కనీసం ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నాడని, నరసరావుపేటకు వచ్చి కనీసం ఈ కుటుంబాన్ని పరామర్శించలేదని ప్రశ్నించారు, ఆ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఎక్స్ గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు అరుదైన గౌరవం

విశాలాంధ్ర - వినుకొండ : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ హైదరాబాద్‌లో వినుకొండ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ చిత్రీకరించిన చాకలి ఐలమ్మ వర్ణచిత్రం, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బి.సంధ్య విప్లవ్ వ్రాసిన ఇరవై ఇంగ్లీష్ కవితలు జెస్టిస్ బ్రష్‌తో చిత్రీకరించారు. ఎంతో గొప్పగా గీసిన ఈ చిత్రం శుక్రవారం వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ దర్బార్ హాల్లో శాశ్వతంగా కొలువు తీరింది. ఈ చిత్ర ఆవిష్కరణా కార్యక్రమానికి ప్రముఖ నటుడు, సినీ దర్శకులు బి.నరసింగరావు, ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, డాక్టర్ సంధ్య, విప్లవ్, డాక్టర్ హరి, తెలంగాణ ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన చిత్రకారుడు వజ్రగిరి జెస్టిన్‌ను ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా ఎన్నో అవార్డులు కంటే ఈ చిత్రం ద్వారా పొందిన అభినందనలు, యూనివర్సిటీలో చిత్రానికి లభించిన స్థానం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని జెస్టిస్ తెలిపారు. ఈ సందర్భంగా వినుకొండ ప్రముఖులు తోటి కళాకారులు జెస్టిస్‌ను ఎంతగానో అభినందించారు. వినుకొండ ప్రతిభను తెలంగాణ రాష్ట్రంలో కూడా నిలిపినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పిన్నెల్లి

విశాలాంధ్ర-కారంపూడి : రెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం కోదండ రామ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పిన్నెల్లికి స్వాగతం పలికి, పూజల అనంతరం సత్కరించారు. స్వామి వారికి పట్టు వస్త్రం సమర్పించారు. యనుముల, మురళీధర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్‌లో రక్తదానం

విశాలాంధ్ర-యడ్లపాడు: బోయపాలెం గ్రామంలోని విశ్వతేజ స్పిన్నింగ్ మిల్ ఛైర్మన్ దాసరి శేషగిరిరావు 90వ జన్మదినం సందర్భంగా మిల్లులో రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం ఏర్పాటు చేసారు. ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. కార్యక్రమంలో ఛైర్మన్ డి.శేషగిరిరావు, మేనేజింగ్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్, జె.ఎం.డి కె.రమేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ నాగ శివకుమార్, భార్గవ్, టెక్నికల్ డైరెక్టర్ జి.సీతయ్య, మేనేజర్ -హెచ్.ఆర్ సి.హెచ్. రమణ మూర్తి, పల్నాడు రెడ్ క్రాస్ సొసైటీ కో-ఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో శిలువ ధ్యాన కార్యక్రమం

విశాలాంధ్ర - దాచేపల్లి : ఇరికేపల్లి తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం శిలువ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 5న చేపట్టిన ఈ కార్యక్రమం ఈ నెల 18న ముగియనుంది. ఈ 40 రోజుల పాటు క్రైస్తవ సోదరులు కఠిన ఉపవాసాలు ఉంటారు. దాంతో ఈపూరు మండలం ఇన్చార్జి ఈఓపీఆర్డీ నాగేంద్ర రత్నం, ఇరికేపల్లిలోని మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు నాగేంద్ర సుమతీరత్నం దంపతులు ఉపవాసాలు ఉన్న క్రైస్తవ సోదరులకు భోజన వసతి కల్పించారు. తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ తగరం ప్రేమయ్య, కమిటీ సభ్యులు నాగేంద్ర యాకోబు, పట్రా ఆనందరావు, నాగేంద్ర మధు, మాతంగి రాంబాబు, నాగేంద్ర యేషయ్య తో పాటు సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-దుర్గి: ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ కాలేజీలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరుటకు యం.పి.సి, బైపిసి,సిఇసి, అండ్ ఎంఇసి (ఇంగ్లీష్ మీడియం) గ్రూప్‌లలో ప్రవేశం కోసం 2025 మే 22లోపు మీ సేవా, లేదా ఆ న్లైన్ లో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ పి.బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం 10వతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా అ ర్హులే. వారికి 10వ తరగతిలో వచ్చిన మార్కుల ప్రగతి ఆధారంగా రిజర్వేషన్ రూల్స్‌కి లోబడి ప్రవేశాలు జరుగుతాయన్నారు. దరఖాస్తు రుసుం ఓసి, బిసిలకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రుసుం రూ.150అని తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు. లేదా ఈ క్రింద ఫోన్ నెంబర్లకు9160649929, 9440726818లకు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ముత్యాలమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర - రెంటచింతల : మండలంలోని తుమ్మకోట శివారు గ్రామం కొత్త గంగరాజుపల్లెలోని ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి గ్రామస్తులు ఎదురేగి ఘన స్వాగతం పలుకుతూ ట్రాక్టర్లో ఊరేగించారు. ఆలయంలో గ్రామ దేవతలైన ముత్యాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఆలయ పూజారి సతీష్ శర్మ వేదమంత్రోచ్ఛరణలతో గ్రామ దేవతల ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు ఆయన అన్న ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం మల్లవరం గ్రామంలో కనకదుర్గ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులు కబళించే కుట్ర

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లింల సంక్షేమ కార్యక్రమాల కోసం దానం ఇచ్చిన ఆస్తులను కబళించే కుట్ర జరుగుతోందని ముస్లిం జేఏసీ నాయకుడు షేక్ అబ్దుల్ జబ్బార్ విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ, అవాజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలోని వక్ఫ్ భూముల్లో 50శాతం అన్యాక్రాంతం అయ్యాయని, ఈ బిల్లుతో దేశ వ్యాప్తంగా ఇలాంటి అక్రమణలకు అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల కోసం స్థల సేకరణ జరపాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాకు సంబంధించి రొంపిచర్ల, మాచర్లలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరైనందున అవసరమైన స్థలాన్ని త్వరితగతిని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో రెవిన్యూ అధికారులు, కేంద్రీయ విద్యాలయ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాచర్లలో అనువైన ప్రదేశాన్ని గుర్తించి తక్షణమే తరగతులు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారికి సూచించారు. ఈ సందర్భంగా మాచర్ల రెవెన్యూ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మాచర్లలోని పిడుబ్బిడి కాలనీ, జిల్లా పరిషత్ బాయ్స్ పాఠశాలలో రూములు కేటాయించదానికి అనువుగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అదేవిధంగా పిడుబ్బిడి కాలనీలో 5 ఎకరాల స్థలాన్ని గుర్తించారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రొంపిచర్లలో మంజూరైన కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని రీ వెరిఫై చేయాలనీ సంబంధిత మండల రెవెన్యూ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి మురళీ కృష్ణ, నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, రొంపిచర్ల మండల రెవెన్యూ అధికారి నిర్మల, కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి : కేసన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన చేసి, జనాభా ప్రాతిపదికన రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే చట్ట సభల్లో చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేస్తే సరిపోదని, టీడీపీ మద్దతుపై ఆధారపడిన కేంద్రం నుండి సాధించుకోవటానికి కృషి చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ గుంటూరులో ఎన్నికల ముందు జరిపిన సంఘం జనరల్ బాడీ మీటింగ్‌లో 2024 ఎన్నికలలో ఎన్డీఏ కూటమి పక్షాలైన తెలుగుదేశం-జనసేన-భారతీయ జనతా పార్టీలకు తమ బేషరతు మద్దతు ప్రకటించామన్నారు. కానీ బీసీల హక్కుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు. బీసీల సమస్యలపై ప్రభుత్వం ఇదే సాచివేత ధోరణితో ఉంటే పెద్ద ఎత్తున ఉద్యమించాలని సమావేశంలో 26 జిల్లాల నాయకులు స్పష్టం చేశారన్నారు. కూటమి గెలుపునకు కృషి చేసినందుకుగాను కేసన శంకరరావుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి సిఫార్సు చేయాలని, జనగణనతో పాటే సమగ్ర కులగణన జరపాలని, జనాభా దామాషా మేరకు చట్టసభలలో రిజర్వేషన్‌లు ఇవ్వాలని, బీసీలకు రక్షణ చట్టం, "స్థానిక సంస్థలు-నామినేటెడ్ పోస్టులు-నామినేషన్ వర్క్స్ లలో 34 శాతం రిజర్వేషన్లను, క్రీమీ లేయర్ ఎత్తేయాలని పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకారావు, కోశాధికారి కన్నా మాస్టారు, రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి ఉప్పాల శివలక్ష్మి, బీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవివిఎస్ఎన్ మూర్తి, బాదుగున్నల శ్రీనివాస్, కోలా అశోక్, పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, ముప్పాన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో పట్టించుకోలేదు..

వృద్ధురాలి భావోద్వేగం

విశాలాంధ్ర-మంగళగిరి : మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన అడిగొప్పల మల్లీశ్వరి అనే వృద్ధురాలు భావోద్వేగానికి గురయ్యారు. దాదాపు పదేళ్ల నుంచి మంగళగిరి రత్నాలచెరువులో నివాసం ఉంటున్నాం. రహదారి సౌకర్యం, తాగునీరు లేక ఇబ్బందులు పడ్డాం. అద్దె ఇళ్లలో జీవనం సాగించాం. ఎన్నికల సమయంలో రోడ్లు నిర్మిస్తామని, పట్టాలు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. అన్నట్లుగానే రోడ్లు వేశారు, పట్టాలిచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న మాలాంటి వారికి అండగా నిలిచిన ఆయన, ఆయన కుటుంబం చల్లగా ఉండాలి. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇళ్లలోకి నీరు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. రత్నాలచెరువులో నివాసం ఉంటున్న వారికి లోకేష్ చేసిన సాయం మరువలేనిదంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఇంటి పట్టా అందుకునేందుకు స్టేజి వద్దకు వచ్చిన వృద్ధురాలు నడవలేకపోవడంతో స్వయంగా మంత్రి లోకేష్..మహిళ వద్దకు వెళ్లి ఇంటి పట్టా అందించారు. కన్నీటిపర్యంతమైన మహిళను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పేదల ఉపాధి, ప్రమాణాలే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెదకూరపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని గ్రామీణ సామాజిక స్థితిగతులను,జీవనోపాధిని మెరుగుపరుస్తున్నారని అడ్వకేట్ హరిబాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేదరిక తగ్గింపును సులభతరం చేయడానికి ఆధునిక పద్ధతులను,విద్య, ఉపాధి, వృత్తి నైపుణ్యం రంగాలను బలోపేతం చేసి పేదల స్థితిగతులను, జీవన ప్రమాణాలను మెరుగుపరచి.. వారిని అండగా నిలవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వెల్లడించారు. గ్రామీణ పేదలకు చేయందించటమే చంద్రబాబు నూతన ఆవిష్కరణ పీ-4 ముఖ్య ఉద్దేశం మని వెల్లడించారు.

హోమియో వైద్యంలో రారాజు డాక్టర్ రమణ: ఏల్చూరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హోమియో వైద్య రంగంలో విప్లవాత్మకమైన వైద్య విధానాలను తన చికిత్స ద్వారా అందించిన ఘనత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణకే దక్కుతుందని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కళారత్న (హంస)అవార్డు స్వీకరించిన ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓ.వి. రమణను శుక్రవారం కృష్ణనగర్ సాయి నిలయంలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఇ.వి.వి యువ కళా వాహిని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హోమియో వైద్యానికి గుంటూరు నగరాన్ని ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా మార్చటంలో డాక్టర్ రమణ కృషి ఎంతో ఉందన్నారు. హోమియో రంగంలో రారాజు రమణ అని ప్రశంసించారు. సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూహోమియోతో కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా నయం చేయవచ్చని డాక్టర్ రమణ నిరూపించారన్నారు. హోమియోలో వినూత్న విధానాల ద్వారా రమణ ప్రజలకు సేవలందించారని, సమర్థతకు ప్రతిరూపమైన రమణకు ప్రభుత్వం కళారత్న అవార్డు అందచేయడం ప్రతిభకు ఇచ్చిన ప్రశంస అని కొనియాడారు. కళారత్న అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన కృషి, ప్రతిభను గుర్తించి, కళారత్న పురస్కారంతో గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. ఇది మరింత బాధ్యతగా తమ రంగంలో విశిష్ట సేవలందించడానికి ఉత్తేరకంగా పని చేస్తుందన్నారు. ఆధునిక యుగంలో హెూమియో వైద్యం పేద ప్రజల పాలిట సంజీవని అన్నారు. కళా వాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆంగ్ల వైద్యానికి ధీటుగా గుంటూరు జిల్లాలో హోమియో వైద్యం గొప్పదనం, విశిష్టతను చాటి చెప్పిన మహోన్నత వైద్యుడు ఓరుగంటి అని కీర్తించారు. భవిష్యత్‌లో రమణ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళా వాహిని ఉపాధ్యక్షుడు దేవరశెట్టి సుబ్బారావు (బుల్లెట్), పలువురు హోమియో వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సెర్ప్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి అవగాహన ఒప్పందం

గుంటూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సహకా రంతో భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి కార్యక్రమం కింద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ మేరకు సెర్ప్ ఆంధ్రప్రదేశ్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లా డుతూ ఈ సదస్సులో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓలు)కు అవసరమైన మార్కెట్ పరిజానం , డిజి టల్ సాధనాలు వారి వ్యాపారాలను విస్తరింప చేయడా నికి వ్యూహాలతో సన్నద్ధం చేయడంపై దృష్టి సారించిం దన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ కిరాణా వ్యాపారానికి సోర్సింగ్ అవకాశాలను కూడా వర్క్‌షాప్ నొక్కి చెప్పిందన్నారు. దీని వలన రైతులు, వ్యవసాయ వ్యాపారాలు జాతీయ మార్కెట్ అవకాశాలను పొందగలుగుతాయని అన్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఎంఎస్ఎంఈ లు, వ్యవసాయ వ్యాపారాలు, రైతు సంఘాలకు వ్యూహా త్మక మార్కెట్ అనుసంధానిత, ఇ కామర్స్ ఏకీకరణకు తోడ్పాటు అందించడం ద్వారా మద్దతు ఇస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్రంలోని చిన్న వ్యాపారాలు మరియు రైతులకు స్థిరమైన వృద్ధి, జీవనోపాధి కల్పన మరియు ఆర్థిక చేరికను అందించటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా చిన్న వ్యాపారాలు రైతులకు మద్దతు ఇవ్వడం ఫ్లిప్‌కార్ట్ లక్ష్యంలో అంతర్భాగం అని, తాము దృష్టి సారించిన అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి అన్నారు. సెర్ప్ తో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా, వ్యవసాయ వ్యాపారాలు , గ్రామీణ వ్యాపారులకు అవసరమైన సాధనాలు, పరిజానం మరియు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వారి పరిధిని విస్తరించడానికి మరియు విజయం సాధించడానికి అవకాశాలను కల్పించడానికి తాము కట్టుబడి ఉన్నాము అని అన్నారు.

గౌరవ వేతనం కోసం బీఎల్వోల ఎదురు చూపు

విశాలాంధ్ర - దాచేపల్లి : నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలోని బీఎల్వోలు తమకు రావల్సిన గౌరవ వేతనం కోసం ఏడాదికి పైగా ఎదురు చూస్తున్నారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏర్పడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వీటి చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేసింది. ఒక్క దాచేపల్లి మండలం మాత్రమే మిగిలిపోయింది. అది ఎలాగంటే రెవెన్యూ శాఖలో అప్పుడు పని చేసిన అధికారులు, ఉద్యోగులు సకాలంలో ట్రెజరీకి బిల్లులు పంపకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. ఫలితంగా బీఎల్వోలు తమ గౌరవ వేతనం అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీ సహా గ్రామీణ మండలం అంతటా అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగుల్లో 85 మందికి పైగా సిబ్బంది బీఎల్వోలుగా విధులు నిర్వహించారు. 2021 నుంచి 2024 వరకు ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపుల వంటి క్లిష్టమైన ప్రక్రియను పూర్తి చేశారు. దానికి గాను వారికి నెలకు రూ 500 చొప్పున గౌరవం వేతనాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ విధంగా ఒక్కొక్కరికీ రూ 12,750 చొప్పున రావల్సి ఉంది. ఏడాది నుంచి అదిగో, ఇదిగో అంటూ ఎదురు చూడడం తప్ప ఫలితం కన్పించడం లేదు. ఈ నేపధ్యంలో నిరాశకు లోనైన వారంతా తాజాగా గురజాల ఆర్డీఓ, దాచేపల్లి తహశీల్దార్ కార్యాలయాల్లో అధికారులను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. తమ సమస్యను పరిష్కరించి తమకు రావల్సిన గౌరవ వేతనాన్ని ఇప్పించాలని విన్నవించారు. దీనిపై సంబంధిత అధికారులు మాట్లాడుతూ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్ళి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

CHANGE OF SURNAME

I, Dasari Taruna Durga, D/o. Vasireddy Rajasekhar, R/o. F.No.502, Sri Sai Teja Annex, 8/2 Syamalanagar, Guntur of Guntur District, AP have changed my surname to **Vasireddy Taruna Durga**, W/o.Dasari Raveendra Babu(New Name) I henceforth be known as **Vasireddy Taruna Durga**, By:Vasireddy Taruna Durga.

లాంలో డీఎల్‌పీఓ పర్యటన

విశాలాంధ్ర-తాడికొండ : పారిశుద్ధ్య సమస్యలను తెలుసుకునేందుకు గుంటూరు డీఎల్‌పీఓ కందిమల్ల శ్రీనివాసరావు శుక్రవారం లాం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు పనితీరు ఎలా ఉంది అని గ్రామస్తులు ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ అధికారులు తడి పొడి చెత్తకు సంబంధించి డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. గ్రామంలో వీధి వీధిన కుక్కల బెడద ఎక్కువగా ఉందని చిన్నపిల్లలు నిత్యం కుక్క కాటుకు గురవుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని రిజ్వాన అనే మహిళ అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. ఈఓపీఆర్డీ సాయి లీల, పంచాయతీ కార్యదర్శి ఏ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా సురేష్ కుమార్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎన్.సురేష్ కుమార్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన నేత్ర వైద్య నిపుణులుగా పనిచేస్తూ సూపరిండెం ట్‌గా నియమితుల య్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్చా ర్జి సూపరిండెంట్‌గా, పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణ (డీసీహెచ్ఎస్) ఇంఛార్జి అధికారిగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ బీవీ రంగారావు గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్‌గా బదిలీ అయ్యారు.

ఇళ్ల పట్టా లబ్ధిదారులకు ఆహ్వాన పత్రికలు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా మన ఇల్లు మన లోకేష్ పేరుతో ఇస్తున్న ఇంటి పట్టాల ఇన్విటేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఇతర నాయకులు లబ్ధిదారులకు ఆహ్వానం పత్రాలు అందజే శారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దాంటా దాసు, సీనియర్ నాయకులు అద్దంకి మురళి, ఇట్టా పెంచలయ్య, వంగర శంకర్రావు, తాడిబోయిన భాస్కర్, తాడిబోయిన గోపి, కంభం సాయి చంద్, తాడేపల్లి కిరణ్, ఎస్‌కే నాగూర్ వలి, గుడివాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపి మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం క్రింద ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు ఎంతో విలువైనవని అన్నారు. విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Sri. Shaik Mabu, S/o. Shaik Jhonu (New Name) previously called as Sri.Shaik Maabhu, S/o.Shaik John (Old Name), resident of Phirangipuram village, Muslim Bazar of Phirangipuram Mandal. Now changed my name from Sri. Shaik Maabhu, S/o. Shaik John (Old Name) to **Sri.Shaik Mabu, S/o. Shaik Jhonu (New Name)**. Henceforth I am being called as **Sri. Shaik Mabu S/o. Shaik Jhonu (New Name)** for all purposes

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా శుక్రవారం నరసరావుపేట పట్టణం లోని 26వ వార్డు లెనిన్ నగర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజా వ్యతిరేక విధానాల్ని పాల్పడుతుందని, కార్పొరేట్ శక్తులకు నరేంద్ర మోడీ ఊడిగం చేస్తూ రాయితీలు కల్పిస్తూ సామాన్య మధ్యతరగతి ప్రజల పైన పెనుభారాలు మోపుతున్నారని మండి పడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాశారని పేర్కొన్నారు. ముస్లింల హక్కులు, స్వేచ్ఛను కాలరాయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతూ వక్ఫ్ బిల్లును తెరమీదకు తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.మదన్మోహన్ రాజు, ఆదిత్య నాగూర్, రమణ, శివ సాయి, ఎస్.కె చిన్న జాను సైదా జక్రం చిన్న సైదా యాకోబు చంద్ర పాలు రమేష తదితరులు పాల్గొన్నారు

బీజేపీ ప్రభుత్వంలో మైనార్టీలకు రక్షణ కరువు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రధాని మోదీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని సీపీఐ ఏరియా ఇన్చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు అన్నారు. సీపీఐ దేశవ్యాప్త ప్రచార ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. దేశంలో మోడీ అధికారంలో మైనార్టీలకు, భద్రత లేకుండా పోయిందని, వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో ముస్లిం మైనార్టీల హక్కులను కాలారాశారని పేర్కొన్నారు. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేటు అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ విస్తారంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఐక్యపోరాటంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను దుర్మార్గులుగా చూపుతూ స్వపక్షంలోని అవినీతిపరులను వెనకేసుకొస్తూ బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలకు తెరలేపుతున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, కందిమల్ల వెంకటే శ్వర్లు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, సౌతు పల్లి నాగేశ్వరరావు, ముసబోయినా వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు మల్లికార్జున్, రాంబాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.నాగేశ్వరరావు, నాసర్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చిలకలూరిపేట: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ప్రజల అవసరాలు, ప్రభుత్వ పథకాలు, కార్యకలాపాల నిర్వహణకు తగినట్టుగా వినియోగించుకోవాలని, వారి సేవలు ఎక్కడ అవసరమో గుర్తించి, సిబ్బంది విలీన, బదిలీ ప్రక్రియను అధికారులు సమర్ధవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో మాజీమంత్రి ప్రత్తిపాటి తన నివాసంలో సచివాలయాల విలీనం, సిబ్బంది బదిలీ, వారి పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాల అమల్లో ఎంపీడీవోలు బాధ్యతతో పని చేయాలని, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమల్లో ఎలాంటి తప్పులు జరగడానికి వీల్లేదని, ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు ఉండాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన ఉండాలని, అభివృద్ధిపనుల్లో వేగం పెంచాలని ఆయన తెలిపారు. కూటమిప్రభుత్వం ప్రజలు మెచ్చేలా, వారికి అందుబాటులో ఉండేలా సచివాలయ సిబ్బందితో పనిచేయిస్తోందన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని పట్టణ, మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయి బాబు, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, ఎంపీడీవో లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం: సీపీఐ

విశాలాంధ్ర-పెదకాకాని : మండలంలో అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పల్లా లమ్మ చెరువులోని నీటిని అక్రమంగా బయటకు తరలించడాన్ని నిలిపివేయాలని సీపీఐ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులను డిమాండ్ చేసినా నేటికి కూడా యథేచ్ఛగా నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించడం జరుగుతోందన్నారు. చేపల పాటదారునికి పెదకాకాని పంచాయతీలోని కొంతమంది వార్డు మెంబర్లు అండదండలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. పల్లాలమ్మ చెరువు అంశంపై గురువారం వినతిపత్రం సమర్పించిన సమయంలో పెదకాకాని పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ తాము చెరువులోని నీరు బయటకు పంపించడానికి ఎవరికి అనుమతి ఇవ్వలేదని, అలాగే పంచాయతీ మోటార్లను కూడా ఇవ్వలేదని చెప్పారన్నారు. కానీ ఆ మోటార్లు పంచాయతీవేనని తెలుస్తుందన్నారు. కనుక మోటార్లను వెంటనే స్వాధీనం చేసుకుని ఈ వేసవికాలంలో భూగర్భ జలాలు ఇంకిపోకుండా గ్రామ ప్రజల అవసరాలతో పాటు, మూడు పుణ్య క్షేత్రాలకు ప్రతిరోజు వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్‌కు కూడా వినతిపత్రం సమర్పించి, న్యాయం చేయమని కోరుతామని స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేతినేని అగస్టీన్, గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, రెంటాల మోజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు స్థానిక నరసరావుపేట లోని శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానంద రెడ్డి(రెడ్డి కాలేజ్) కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన ప్రక్రియను పరిశీలించారు. పరీక్ష పత్రాలను భద్రపరిచిన గదిని పరిశీలించి ఎంత శాతం మూల్యాంకన జరిగింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం: వైసీపీ

విశాలాంధ్ర - దాచే పల్లి : వక్ఫ్ బోర్డులో కేంద్ర ప్రభుత్వం తీసు కొచ్చిన సవరణ చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వైసీపీ మైనార్టీ విభాగం దాచేపల్లి మండల శాఖ శ్రేణులు పేర్కొన్నారు. శుక్రవారం నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. దేశంలో ఉన్న ముస్లిం సమాజానికి కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేసినట్లు ఆరోపించారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది ముస్లింలకు దారుణంగా మోసం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తాము కూడా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో ఏపీలోని ముస్లింలకు వైసీపీ నేత జగన్ అండగా నిలవడం పట్ల వారంతా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలపై చిల్డ్రన్ కమిటీలు ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని జలాలపురం గ్రామం సచివాలయంలో శుక్రవారం సచివాలయం సిబ్బంది అంగన్వాడి ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు సర్పంచులకు చిల్డ్రన్ కమిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు ముఖ్య అతిగా పాల్గొని మాట్లాడుతూ చిన్నారులు బాల్యం నుంచే మానసిక వికాసం కలిగి ఉండాలని అన్నారు. సచివాలయం డిజిటల్ అధికారి జి సాగర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కలిగించినప్పుడే వారిలో చైతన్యం తేవడానికి అవకాశం ఉంటుందన్నారు. మహిళా కానిస్టేబుల్ విజయదుర్గ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్వాడి కార్యకర్త మాలతి ఉజ్ఞానేశ్వర్ రెడ్డి జోసెఫ్ రాము సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, RAHIMUN MAMIDALA (Old Name), W/o. Mamidala Anka Raju, Resident of Door No:15-12-159, 2nd Line Sita Ram Nagar, Venkata Rao Pet, Guntur - 522001, Guntur District, Andhra Pradesh. I have changed my surname as **SHAIK RAHIMUN** (New Name) W/o. **Mamidala Anka Raju**. Hereafter my surname is known as **SHAIK RAHIMUN** (New Name) W/o. **Mamidala Anka Raju**.

వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఈరోజు అనగా శుక్రవారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. హైదరాబాద్ వారి రాండ్స్టాడ్ కంపెనీ హెచ్ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. వివిధ పరీక్షల అనంతరం 13 మంది విద్యార్థులు ఎంపికైనారు. కళాశాల సెక్రటరీ ఎన్ సత్యనారాయణరెడ్డి గారు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ పిఎస్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ జీవడ్డీ కాసులు విభాగాధిపతులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

సహజ యోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సహజయోగ ధ్యానాన్ని ప్రతిరోజూ ఆచరించటం కుండలినీ జాగృతి అవ్వడంతో ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చునని సహజ యోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరి రామకృష్ణ అన్నారు. హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 4నుంచి 10వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో జరగనున్న సహజయోగ చైతన్య ప్రచార రథ యాత్ర తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్, కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి నుంచి జగ్గయ్యపేట వద్ద ఎన్టీఆర్ జిల్లాలో శుక్రవారం ప్రవేశించింది. ఉదయం 6 గంటలకు కంచికచర్ల మీదుగా మూలపాడు చేరుకుంది. 11.30 గంటలవరకూ గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం జరిగింది. అనంతరం విజయ వాడ రూరల్ మండలం గొల్లపూడికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది. గొల్లపూడి వన్‌సెంటరులో సహజ యోగులు ఘన స్వాగతం పలికారు. సహజయోగం విశ్వనిర్మలధర్మం విశ్వ నిర్మల ధర్మ ప్రస్థాపిని శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారు విశ్వమంతా ఒకే ధర్మం స్థాపించాబడాలనే కృతనిశ్చ యంతో 1970 మే 5న సహజయోగ ధ్యానాన్ని ప్రవేశపెట్టారని కల్లూరి రామకృష్ణ అన్నారు. ఎన్‌టిఆర్‌జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార రథయాత్ర కన్వీనర్ ఎస్. శంకర్, విజయవాడ నగర కోఆర్డినేటర్ టి.రవీంద్ర బాబు మాట్లాడుతూ హెచ్‌హెచ్ శ్రీ మాతాజీ నిర్మలా దేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 4నుంచి 10వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో సహజయోగ చైతన్య ప్రచార రథం పర్యటించ నుందన్నారు. 5,6 తేదీల్లో ఉయ్యూరులో జరిగే యాత్రను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఆరునెలలపాటు ఈ రథయాత్ర జరగనుంది. సుమారు 150 దేశాల్లో సహజయోగాన్ని ప్రజలు ఆచరిస్తున్నారని తెలిపారు.

హోటల్ రంగానికి సీఎం రాయితీలు ప్రకటించడం హర్షనీయం

విశాలాంధ్ర- విజయవాడ లబ్బీపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు హోటల్ రంగానికి రాయితీలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రాయితీలు చూసి రాష్ట్రంలో మరిన్ని స్టార్ హోటల్స్ వస్తున్నాయని చెప్పారు. స్టార్ హొటల్స్కు ఎక్సైజ్ సుంకం ఏటా 66 లక్షలు చెల్లిస్తున్నామని దానికి తగ్గట్టుగా వ్యాపా రాలు ఉండకపోవడంతో నష్టం వస్తున్నదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన తాజాగా జరిగిన కేబినె ట్‌లో ఎక్సైజ్ సుంకం రూ. 66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గిస్తూ నిర్ణ యం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి టూరిజం శాఖకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గేట్వే హొటల్ అధినేత రాజయ్య మాట్లా డుతూ ఏపీలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ఐటీ కంపెనీలు పెరగాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు. ఏపీలో సముద్ర తీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, ఐటీ రంగం కూడా అదే తరహాలో ఏర్పాటు జరిగేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెడితే ఏపీ దేశం లోనే మొదటి స్థానంలో ఉండటం ఖాయమని చెప్పారు. అమరావతిలో 17 స్టార్ హోటల్స్ రానున్నాయని గ్రీన్ హొటల్ అధినేత గోకరాజు గంగరాజు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల వరకు హొటల్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరడంతో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సానుకూలంగా స్పందించి అనుమతులు ఇవ్వడం జరిగిందని చెప్పారు.

ఎస్.ఆర్.జి.ఇ.సిలో 27వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 27 విద్యా వసంతాల వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం క్రీడా, సాహిత్య మరియు సాంస్కృతిక విభాగాలకు సంబంధించి నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముందుగా ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొపెసర్ డా. బి.దాసు వార్షిక నివేదికను సమర్పించి మాట్లాడుతూ శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సాంకేతిక విద్యా నైపుణ్యంతో పాటు విద్యార్థులకు మరియు అధ్యాపకులకు సాహితీ, సాంస్కృతిక, క్రీడా రంగాలలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలియజేశారు. సాహిత్య మరియు సాంస్కృతిక వార్షిక నివేదికను డా. జె.ఏ.రంగ బాబు సమర్పిస్తూ కళాశాల విద్యా విజ్ఞానముతో పాటు సాంస్కృతీ సాహిత్యాలపై శిక్షణ మరియు అవగాహన కల్పించుటకై నేటి తరం విద్యార్థినీ విద్యార్థులకు పాటల పోటీలు, తెలుగు అంత్యాక్షరి, ఫ్లోర్ క్రాసింగ్, వ్యాసరచన, ఫిక్షనరీ, మైమ్, మిమిక్రీ, ఏకపాత్రాభినయం, వక్తృత్వ, సాహిత్య మరియు సాంస్కృతిక వంటి పలు పోటీలను నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచినవారికి అతిథుల ఆద్వర్యములో ఘనంగా బహుమతులను అందించారు. ఈ సందర్భముగా కళాశాల యజమాన్యం సహకారంతో 81,000 రూపాయలు నగదు పారితోషకాలను విశ్వ విద్యాలయ స్థాయిలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి అథెలిటిక్స్ మరియు క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలియజేశారు. సుమారు 42,000 రూపాయల నగదు పారితోషకాన్ని యూనివర్సిటీ బ్లూన్ గా పేరొందిన 21 మంది విద్యార్థులకు, అథెలిటిక్స్ మరియు క్రీడా పోటీలలో పాల్గొన్న సుమారు 200 మంది విద్యార్థులకు 36,000 రూపాయలు నగదు పారితోషకాన్ని అందజేయనున్నట్లు తెలియజేశారు. క్రీడా వార్షిక నేవేదికను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మత్తి శివశంకర్ సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా, వేడుకల ముగింపుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డా. పి.కోదండ రామారావు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగపడే అన్నీ రకాల కార్యక్రమాలను శ్రద్ధ తో క్రమశిక్షణతో వ్యయ ప్రయాసాలను ఓర్చి చక్కటి కార్యక్రమాలను అందజేస్తుందని, ఇక ముందు కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తారని ఈ కార్యక్రమములో భాగస్వామ్యం వహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసి వందన సమర్పణ చేశారు. తదుపరి జాతీయ గీతాలపనతో కార్యక్రమముతో ముగిసింది.

దేశ వ్యాప్తంగా బ్రీత్ ఫ్రీ యాత్ర

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వాయు నాళాల సంబంధిత ఆరోగ్యము వాటికి సంబంధించి ప్రభావవంతమైన థెరపీ పరిష్కారాలు అందించడము పట్ల అవగాహన కలిగించాలనే దాని నిబద్ధత కొనసాగించడానికి సిప్లా లిమిటెడ్, రోగికి సపోర్ట్ అందించే ఇనీషియేటివ్, బ్రీత్ ఫ్రీ. అని కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ కే. అనిల్ కుమార్ అన్నారు. ఇది ప్రభావము చూపే ప్రయాణము, దీనిని దేశము అంతటా కొనసాగిస్తోంది బ్రీత్ ఫ్రీ యాత్రతో. వ్యక్తులకు వారి వాయు నాళాల ఆరోగ్యముని అసెస్ చేయడానికి మరియు అర్థము చేసుకోవడానికి సహాయము చేయడమే ఈ యాత్ర ఉద్దేశ్యము, ఇది బాగా విస్తరించిన అవగాహన మరియు రోగికి నేరుగా సపోర్ట్ అందించడము ద్వారా సాధ్యపడుతుంది, దీర్ఘకాల ఊపిరి రోగాలైన ఉబ్బసము మరియు సిఒపిడి (క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మోనరీ డిసీజ్) వంటి వాటి స్క్రీనింగ్ ఛానెల్సుకి యాక్సెస్ మెరుగుపరచడమే ఈ యాత్ర ఉద్దేశ్యము, ఈ బ్రీత్ ఫ్రీ యాత్ర, 335 పట్టణాలకు ప్రయాణము చేసింది, 6,600 పైగా క్యాంపులు నిర్వహించింది. భారతదేశము అంతటా 10 లక్షల రోగులకు సపోర్ట్ అందించిందన్నారు.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ సిరీస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, ప్రారంభ ధర రూ. 42999 వద్ద గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ, గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ ప్లస్ లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఇది ప్రీమియం టాబ్లెట్ డిజైన్‌లో గెలాక్సీ పర్యావరణ వ్యవస్థకు సరికొత్త అంశాలను అందిస్తుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ సిరీస్‌లో ఇప్పటివరకు అతిపెద్ద స్క్రీన్, దాని డిస్‌ప్లేను విస్తరించే స్లిమ్మర్ బెజెల్‌తో కూడిన గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ ప్లస్ వినోదం నుండి అధ్యయనం, రోజువారీ పనుల వరకు ప్రతిదానికీ ఆహ్లాదకరమైన, లీనమయ్యే వీక్షణ అనుభవాన్ని అందిస్తుంది. సామ్‌సంగ్ యొక్క తెలివైన లక్షణాలు వినియోగదారులను సులభంగా మరిన్ని చేయడానికి శక్తినిస్తాయి. అయితే సన్నని డిజైన్ వినియోగదారులు ప్రయాణంలో సైతం తమ సృజనాత్మకత, ఉత్పాదకతను సాధించడంలో సహాయపడుతుంది.

వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా నిరసనలు తప్పవు

విశాలాంధ్ర-గుడివాడ: లౌకిక విలువలను మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని సిపియం నాయకులు ఆర్‌సిపిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సిపియం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ బిజెపి హిందు మతోన్మాద ఎజెండా కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందన్నారు. లవ్ జిహాద్ వాపసి కామన్ సివిల్ కోడ్ మసీదుల విధ్వంశం ముఖ హత్యలతో హిందుత్వ శక్తులు తలపడుతున్నా యన్నారు. ఈ చట్టం ఆస్తులకు కబ్జా చేయడానికి తప్ప వక్ఫ్‌ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. భారత రాజ్యాంగం లోని 25, 29, 30 తదితర నిబంధనకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయడం దారుణమన్నారు. సిపిఎం నాయకుడు నీలం మురళీకృష్ణరెడ్డి, పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా సమాపన ఉత్సవాలు దిగ్విజయం నిర్వహించాలి

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : వైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఏడు నుంచి 13 వరకు జరుగనున్న శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపన ఉత్సవాలు దిగ్విజయం కావాలని ఆకాంక్షిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. విద్యాధర పురంలోని అష్టాక్షరి రామాలయం నుండి ప్రారంభమైన ఈ శోభాయాత్ర నాలుగు స్తంభాల సెంటర్, జోజి నగర్, భవానిపురం స్వాతి రోడ్డు మీదుగా ఉత్సవాలు జరిగబొబ్బూరి ప్రాంగణానికి చేరింది. వందలాది మంది భక్తులు హనుమాన్ పతాకాలను చేతబూని ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ శోభాయాత్రలో వైష్ణవ మహా దివ్య క్షేత్ర సేవా సంఘం అధ్యక్షుడు దూపకుంట శ్రీనివాసరావు అగ్రభాగాన నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 13 వరకు కృష్ణా తీరంలోని బొబ్బూరి ప్రాంగణంలో హనుమాన్ చాలీసా సమాపన ఉత్సవాల నిర్వహిస్తున్నామన్నారు. పెనుమాకలోని తమ క్షేత్రంలోఏడాది పాటు నిర్విరామంగా జరిగిన హనుమాన్ చాలీసా అఖండ పారాయణ ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈ ఉత్సవాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 50వేల మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఇందుకోసం కృష్ణ తీరంలో తిరుమల తరహాలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. స్వామి వారి సన్నిధిలో జరిగే ఉదయాస్తమాన సేవలన్నీ యధావిధిగా ఎక్కడ నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు ఈ సమాపన ఉత్సవాల సందర్భంగా నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీనివాసరావు కోరారు. ఈ శోభాయాత్రలో సేవా సంఘం ప్రతినిధులు, ఆలపాటి సుందరరావు కొప్పురావూరి శ్రీమన్నారాయణ బాలగంగాధర్ కోటేశ్వరరావు, శ్రీవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించండి

విశాలాంధ్ర-చల్లపల్లి : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ కళాశాల విద్యా ర్థుల గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిం చాల్సిందిగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డా.డి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సంధ్య తెలిపారు. మోపిదేవి పంచాయతీ శివారు రానివారి పాలెం గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రైతులు తమ అన భవాలను ప్రదర్శనాపూర్వకంగా తెలియజేశారు. గ్రామంలో ఏడు రోజులపాటు విద్యార్థులు నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాలకు గ్రామస్థులు సహకరించాలన్నారు.